ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



మహబూబాబాద్

ఆదివారం 27 ఏప్రిల్ 2025

5



మహబూబాబాద్‌లో మాట్లాడుతున్న శ్రీనివాసులు



ఎల్కతుర్తిలో సిద్ధమైన బీఆర్ఎస్ రజతోత్సవ సభా వేదిక

సభా ప్రాంగణం వద్ద కేసీఆర్ కటౌట్

సందడిగా.. వడివడిగా..

నేడు బీఆర్ఎస్ రజతోత్సవ మహా సభ

- ఎడ్లబండ్లు, ప్రభబండ్లు, ర్యాలీలు, పాదయాత్రలతో తరలుతున్న శ్రేణులు
- స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు, పార్టీజెండాలతో ఓరుగల్లు రోడ్లు గులాబీమయం
- విస్తృత ఏర్పాట్లు చేసిన బీఆర్ఎస్ నేతలు
- 1,213 ఎకరాల్లో సభ ప్రాంగణం, పార్కింగ్ ఏర్పాట్లు
- 1,100మంది పోలీసులతో బందోబస్తు

7

ఎల్కతుర్తి బాటలో గులాబీ దళం

'గులాబీ' పార్టీ పాతికేళ్ల పండుగకు ఓరుగల్లు ముస్తాబైంది. ఎల్కతుర్తి వేదికగా ఆదివారం జరిగే బీఆర్ఎస్ సభకు సర్వం సిద్ధమైంది. తమ అధినేత కేసీఆర్‌తో పాటు ముఖ్యనేతలంతా హాజరయ్యే ఈ సభను విజయవంతం చేసేందుకు ఆ పార్టీ శ్రేణులు వడివడిగా అడుగులు వేస్తున్నాయి. పాదయాత్రలు, ఎడ్లబండ్లు, ప్రభ బండ్లు, వాహనాల ర్యాలీలతో సభా ప్రాంగణానికి పయనమవడంతో ఓరుగల్లు రోడ్లు గులాబీ మయమయ్యాయి. ఉమ్మడి జిల్లాతో పాటు చుట్టుపక్కల జిల్లాలకు చెందిన శ్రేణుల రాకతో సర్వత్రా సందడి వాతావరణం కనిపిస్తోంది. ఇప్పటికే పలు ప్రధాన రహదారులు, కూడళ్లతో పాటు ఎల్కతుర్తి మండల కేంద్రం గులాబీ జెండాలు, తోరణాలు, నేతల కటౌట్లు, ఫ్లెక్సీలతో కళకళలాడుతున్నాయి. 2005, 2010లో వరంగల్ కేంద్రంగా నిర్వహించిన భారీ బహిరంగ సభలకు దీటుగా ఈ రజతోత్సవ సభను నిర్వహించేలా.. లక్షలాదిగా జనసమీకరణ చేసేందుకు గులాబీదళం కార్యాచరణ అమలు చేసింది. ఇక అసెంబ్లీ ఎన్నికలు సహా వరుస ఓటములతో నైరాశ్యంలో ఉన్న గులాబీ శ్రేణుల్లో ఉత్సాహాన్ని నింపేలా సభను జయప్రదం చేయాలన్న సంకల్పంతో పార్టీ యంత్రాంగం విస్తృత ఏర్పాట్లు చేసింది. మొత్తం 1,216 ఎకరాలను సిద్ధం చేయగా.. 169ఎకరాల్లో సభప్రాంగణం, వెయ్యి ఎకరాల్లో పార్కింగ్, మిగతా స్థలాల్లో మరుగుదొడ్లు, ఇతరత్రా సౌకర్యాలు కల్పించి.. పర్యవేక్షణకు సీసీ కెమెరాలు, 2వేల మంది వలంటీర్లను ఏర్పాటు చేసింది.

- ఆంధ్రజ్యోతి ప్రతినిధి, వరంగల్



సభ ఏర్పాట్ల గురించి నేతలతో మాట్లాడుతున్న హరీశ్‌రావు

ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా సమర్థవంతంగా పనిచేస్తాం

- బీఆర్ఎస్ పుట్టిందే వారి కోసం.. దేశానికి మార్గదర్శి కేసీఆర్
- దేవుళ్లపై ఒట్లేసి.. అసెంబ్లీలో మాటిచ్చి మోసం చేసింది కాంగ్రెస్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే తన్నీరు హరీశ్‌రావు
- ఎల్కతుర్తిలో సభ ఏర్పాట్ల పరిశీలన

7

పాయింట్ ఆఫ్ సేల్ మిషన్ల ద్వారానే తూకాలు

- వ్యాపారులు సహకరించాలి
- వరంగల్ మార్కెటింగ్‌శాఖ జేడీ శ్రీనివాసులు

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబా బాద్ వ్యవసాయ మార్కెట్‌లో ఇక నుంచి మార్కెట్‌లో జరిగే క్రయవిక్ర యాలు క్రమపద్ధతిలో నిర్వహిస్తున్నామని, మార్కెట్‌లో రైతుల సరుకులను తూకాలు వేసేటప్పుడు పాయింట్ ఆఫ్ సేల్ (పీఓఎస్) మిషన్‌ల ద్వారానే కాంటాలు నిర్వహిస్తామని మార్కెటింగ్‌శాఖ వరంగల్ రీజియన్ జాయింట్ డైరెక్టర్ శ్రీనివాసులు తెలిపారు. ఇందుకోసం వ్యాపారులు సహకరించాలని కోరారు. మహబూబాబాద్ వ్యవసాయ మార్కెట్‌లో శనివారం సాయంత్రం మార్కెట్ చైర్మన్ ఇస్లావత్ సుధాకర్ అధ్యక్షతన వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇక నుంచి మార్కెట్‌లో రాత్రి 9 గంటల నుంచి ఉదయం 8 గంటల వరకే రైతుల సరుకులను లోనికి రానిస్తామని, ఉదయం 8 తర్వాత సరుకులను లోనికి రానిచ్చేది లేదని తెలిపారు. ఆ లోగా వచ్చిన సరుకులను మాత్రమే గేట్ ఎంట్రీ పాసులు ఇచ్చి వేలం పాటలు నిర్వహిస్తామని, కాంటాలు చేసే సమయంలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా సక్రమంగా నిర్వహించాలని సూచించారు. యార్డులో లైట్లు ఏర్పాటు చేస్తామని, ఇతర సౌకర్యాలు కూడా కల్పిస్తామని, వ్యాపారులు కొత్త పద్ధతులకు సహకరించాలన్నారు.

మార్కెట్ చైర్మన్ సుధాకర్ మాట్లాడుతూ మార్కెట్‌లో సిబ్బంది తక్కువగా ఉన్నారని, ఆపరేటర్లు, సిబ్బందిని ఏర్పాటు చేసుకోవడానికి మార్కెట్ పాలక మండలి సమావేశంలో తీర్మాణిం చినట్లు చెప్పారు. యార్డులో ఆధు నాతన షెడ్డుని ర్మాణం, రైతుల విశ్రాంతి భవనం, డ్రైనేజీ ఏర్పాటు, సీసీ కెమెరాల ఏర్పాటుతో పాటు నూతన కార్యాలయ భవన నిర్మాణానికి పాలకమండలి సమావేశంలో తీర్మాణించినట్లు చెప్పారు. నూతన మోడల్ మార్కెట్ కోసం స్థల సేకరణ కోసం ప్రభుత్వానికి నివేదించి కేసముద్రం మార్కెట్ అభివృద్ధి జరిగిన విధంగానే అంతకుమించి మహబూబాబాద్ మార్కెట్‌ను అభివృద్ధి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో మార్కెటింగ్ శాఖ డీడీఎం పద్మావతి, మార్కెట్ వైస్ చైర్మన్ మదన్‌గోపాల్‌లోయ, వ్యాపారులు దీపక్, గోపాల్, విజయ్, ప్రకాష్, దామోదర్, మదన్, జగదీష్‌తో పాటు మార్కెట్ కార్యదర్శి శంషీర్, సూపర్‌వైజర్ రమేష్, డైరెక్టర్లు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల సర్వే వేగవంతం చేయాలి

కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్



మహబూబాబాద్ సమావేశంలో మాట్లాడుతున్న అద్వైత్‌కుమార్‌సింగ్

మహబూబాబాద్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఇందిరమ్మ ఇళ్ల సర్వే, నిర్మాణ పనులను వేగవంతం చేయాలని కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ అధికారులను ఆదేశించారు. కలెక్టర్ కార్యాలయంలో శనివారం ఇందిరమ్మ ఇళ్లపై మండల ప్రత్యేకాధికారులు, మండల పరిషత్ అభివృద్ధి అధికారులు, మునిసిపల్ కమిషనర్లు, హౌసింగ్ అధికారులతో సమావేశాన్ని నిర్వహిం చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ఇందిరమ్మ ఇళ్ల పథకం ద్వారా నిరుపేదల సొంతింటి కలను నెరవేరుస్తుందన్నారు. మోడల్‌హౌస్ నిర్మాణ పనుల్లో వేగం పెంచాలని, పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపికైనా గ్రామాల్లో ఇందిరమ్మ ఇళ్ల నిర్మాణాలను త్వరితగతిన పూర్తి చేయాలని సూచించారు. క్షేత్రస్థాయిలో సర్వే ప్రకారం సమాచారం సేకరిం చాలని, అర్హులైన లబ్ధిదారుల జాబితాను సిద్ధం చేయాలన్నారు. ఇందిరమ్మ కమిటీ ప్రకారం కేటాయించిన జాబితా ఖచ్చితంగా చెక్ చేసుకోవాలని చెప్పారు. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సర్వేను ప్రత్యేక అధికారులు పరిశీలించా లన్నారు. రాజీవ్ యువ వికాసం పథకం ద్వారా వచ్చిన దరఖాస్తులను పరిశీలించి యూనిట్స్ ప్రకారం వేర్వేరుగా సిద్ధం చేయాలన్నారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్లు లెనిన్‌వత్సల్ టొప్పో, కె.వీరబ్రహ్మాచారి, అధికారులు పురుషోత్తం, రాజయ్య, మధుసూదనరాజు, వెంకటేశ్వర్లు, నర్సింహస్వామి పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా రజతోత్సవ సభ

- ప్రజలే స్వచ్ఛందంగా తరలొస్తున్నారు
- మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చూడాలనుకుంటున్నారు
- టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌ది ఒకటే జెండా.. ఒకటే అజెండా
- అదే కారుగుర్తు.. కేసీఆరే అధ్యక్షుడు
- వరంగల్ సభతో రాష్ట్ర రాజకీయాల్లో సంచలన మార్పులు

7



'ఆంధ్రజ్యోతి'తో ఎమ్మెల్సీ, సభ ఇన్‌చార్జ్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి

నేడు మోడల్ స్కూల్ ప్రవేశ పరీక్ష

- జిల్లా వ్యాప్తంగా 9 సెంటర్ల ఏర్పాటు
- ఎగ్జామ్ రాయనున్న 1,528 మంది విద్యార్థులు

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మోడల్ స్కూల్‌లో ప్రవేశాలకు ఆదివారం నిర్వహించే పరీక్షకు జిల్లా వ్యాప్తంగా 9 ఎగ్జామ్ సెంటర్లను ఏర్పాటు చేసినట్లు డీఈవో రవీందర్‌రెడ్డి శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబా బాద్ జిల్లాలోని మోడల్ స్కూల్స్‌లో 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి ప్రవేశ పరీక్ష నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు 6వ తరగతిలో ప్రవేశాలకు నిర్వహించే పరీక్షకు 885 మంది విద్యార్థులు హాజరుకానున్నట్లు వివరించారు. మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు 7వ తరగతి నుంచి 10వ తరగతి వరకు ఖాళీగా ఉన్న సీట్ల భర్తీకి నిర్వహించే పరీక్షకు 643 మంది విద్యార్థులకు హాజరు కానున్నట్లు పేర్కొన్నారు. మహబూబాబాద్ మోడల్ స్కూల్, ప్రభుత్వ బాలి కోన్నత పాఠశాల, కేసముద్రం మండలం కల్వల మోడల్ స్కూల్, కురవి మండలం నేరడ మోడల్‌స్కూల్, డోర్నకల్ మండలం చిలుకోడు మోడల్ స్కూల్, మరిపెడ మోడల్ స్కూల్, తొర్రూరు మండలం గుర్తూరు మోడల్ స్కూల్, నెల్లికుదురు మోడల్ స్కూల్, నర్సింహులపేట మోడల్ స్కూల్స్‌లో పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు డీఈవో తెలిపారు. పరీక్ష కేంద్రాల్లో విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. పరీక్ష నిర్ణీత సమయానికంటే గంట ముం దుగానే విద్యార్థులు పరీక్ష కేంద్రాలకు చేరుకోవాలనిసూచించారు. సెల్ ఫోన్లు, ఎలక్ట్రానిక్ పరికరాలు పరీక్ష కేంద్రాలకు తీసుకురా వద్దని సూచించారు. ఇతర వివరాలకు ఏసీజీఈ మందుల శ్రీరాములు సెల్ నెంబర్ : 9849761012ను సంప్రదించాలన్నారు.

ఎంజేపీ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తుల ఆహ్వానం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మహాత్మా జ్యోతిరావు పూలే రెసిడెన్షియల్ మహిళా డిగ్రీ కళాశాలలో ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోవాలని ప్రిన్సిపాల్ సునిత శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. మహబూబాబాద్ ఎంజేపీ మహిళా డిగ్రీ కళాశాల ప్రస్తుతం హన్మకొండ జిల్లా కాజీపేట మండలం సోమిడిలో కొనసాగుతుందని తెలిపారు. మహబూబాబాద్ జిల్లాకు చెందిన విద్యార్థినులు 2025-26 విద్యాసంవత్సరం ప్రథమ సంవత్సరంలో ప్రవేశాలు పొందేందుకు ఇంటర్మీడియట్ పూర్తిచేసిన విద్యార్థినులు మే 5 వరకు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలన్నారు. ఇతర వివరాలకు సెల్ నెంబర్ : 94916 85294ను సంప్రదించాలన్నారు.

ఇద్దరు జీపీ కార్యదర్శుల సస్పెన్షన్

వెంకటాపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : చేయూత పథకం నిధులను లబ్ధిదారులకు అందించకుండా స్వాహా చేశారనే ఆరోపణల నేపథ్యంలో ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలో ఇద్దరు గ్రామ పంచాయతీ కార్యదర్శులు సస్పెన్షన్‌కు గురయ్యారు. ఈ మేరకు ములుగు కలెక్టర్ దివాకర శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. వెంకటాపూర్ గ్రామ కార్యదర్శి పి.దామోదర్ ఒక లబ్ధిదారుడి నుంచి 11 నెలలుగా రూ.22వేలు స్వాహా చేశాడని, అలాగే రామాంజాపూర్ గ్రామ కార్యదర్శి తడక శ్రీనివాస్ మూడేళ్లుగా రూ.లక్ష 22వేలు స్వాహా చేశారని కలెక్టర్‌కు ఎంపీడీవో మూడు రాజునాయక్ ఫిర్యాదు చేశారు. దీంతో విచారణ అనంతరం ఇద్దరు కార్యదర్శులను సస్పెండ్ చేస్తూ శనివారం కలెక్టర్ ఉత్తర్వులు జారీ చేశారు. గతంలో కూడా వెంకటాపూర్ కార్యదర్శిపై అనేక ఆరోపణలున్నాయి. ఈ నేపథ్యంలోనే మరోసారి ఆయనపై అవినీతి ఆరోపణలు రావడంతో చర్యలు తీసుకున్నారు.

ప్రజలకు క్షమాపణ చెప్పి రజతోత్సవ సభకు రావాలి

▸▸ బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి



సమావేశంలో మాట్లాడుతున్న ప్రేమేందర్‌రెడ్డి

రాంనగర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ప్రజలను మోసం చేసిన కేసీఆర్ యావత్తు తెలంగాణ ప్రజలకు క్షమాపణ చెప్పి ఎల్కతుర్తిలో జరిగే సభకు రావాలని బీజేపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి గుజ్జుల ప్రేమేందర్‌రెడ్డి అన్నారు. శనివారం హంటర్ రోడ్డులోని బీజేపీ కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ...తెలంగాణ ప్రజల కష్టార్జితాన్ని కాళేశ్వరం ప్రాజెక్టులో పెట్టి అక్కరకు రాకుండా నిర్మించాడన్నారు. ఒక్క పిల్లరు కుంగిపోయిందని ఇన్ని రోజులు ప్రజలకు మాయమాటలు చేప్తూ నెట్టుకొచ్చాడని కానీ కేంద్ర కమిటీ ప్రాజెక్టు మొత్తం ప్రమాదంలో ఉందని, మరో మూడో ప్రాజెక్టులపై సైతం టెక్నికల్‌గా సమగ్రంగా అధ్యయనం చేయాల్సిన అవసరం ఉందని నివేదిక విడుదల చేయడం జరిగిందని గుర్తుచేశారు. దీనిపై ఎల్కతుర్తిలో ఆదివారంజరిగే సభలో ఏమి సమాధానం చేప్తావని ప్రశ్నించారు. రాజకీయ లబ్ధి కోసం కేంద్ర పథకాలైన ఆయుష్మాన్ భారత్, ప్రధాని మంత్రి ఆవాస్ యోజనను రాకుండా అడ్డుకుంది మీరు కాదా.. అని ప్రశ్నించారు. దమ్ముంటే ఉద్యకారులకు రాష్ట్ర అధ్యక్షుడి పదవి ఇచ్చి చిత్తశుద్ధిని నిరూపించుకోవాలని సవాల్ విసిరారు. సమావేశంలో జిల్లా అధ్యక్షుడు కొలను సంతోష్‌రెడ్డి, మాజీ అధ్యక్షురాలు రావు పద్మ, మాజీ ఎమ్మెల్యే అరూరి రమేశ్, ఎస్సీ మోర్చా జిల్లా అధ్యక్షుడు సంద్ర మధు తదితరులు పాల్గొన్నారు.

భూమికి రక్షణగా భూ భారతి చట్టం

▸▸ ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

బయ్యారం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ప్రభుత్వం తీసుకొచ్చిన భూ భారతి చట్టం భూమికి రక్షణ కవచంలా నిలుస్తుందని ఇల్లెందు ఎమ్మెల్యే కోరం కనకయ్య అభిప్రాయపడ్డారు. భూ భారతి చట్టంపై శనివారం బయ్యారంలోని శ్రీ కోదండ రామచంద్రస్వామి కల్యాణ మండపంలో అవగాహన సదస్సు జరిగింది. ఈసందస్సులో ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశంలో ఎక్కడాలేని విధంగా రాష్ట్రంలో అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెడుతున్న పేదల ప్రభుత్వమని పేర్కొన్నారు. సన్నబియ్యం పథకం దేశానికే ఆదర్శప్రాయమన్నారు. ప్రతీ భూ సమస్య పరిష్కారానికి గొప్ప వేదిక నూతన భూ భారతి చట్టమన్నారు. ధరణి కాలంలో పేద రైతులు, నిజమైన లబ్ధిదారులు ఇబ్బందులు పడ్డారన్నారు. గతంలో సాదా బైనామా ధరఖాస్తు చేసుకున్న వారికి ప్రభుత్వ రూల్స్ భూభారతి చట్టం ప్రకారం రికార్డుల నిర్వహణ చేయటం జరుగుతుందన్నారు.

జిల్లా కలెక్టర్ అద్వైత్‌కుమార్ సింగ్ మాట్లాడుతూ నూతన చట్టం ద్వారా పకడ్బందీగా రెవెన్యూ రికార్డుల నిర్వహణ జరగనున్నట్లు పేర్కొన్నారు. భూ భారతి చట్టం ద్వారా ఉచిత న్యాయసేవలు, క్షేత్ర స్థాయిలో నిరుపేదలకు అండగా నూతన చట్టం నిలవనున్నదన్నారు. ప్రభుత్వం అత్యంత విప్లవాత్మకమైన పారదర్శకంగా వేగంగా ప్రతి భూ సమస్య పరిష్కారానికి నూతన భూ భారతి చట్టం ప్రవేశపెట్టిందని అన్నారు. గత చట్టంలో రెవెన్యూ అధికారులకు ఎలాంటి సహాయం చేసే అధికారాలు లేక అనేకమంది సివిల్ కోర్టును ఆశ్రయించలేక



బయ్యారంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కోరం కనకయ్య

పోయారన్నారు. ఇప్పుడు ఆ సమస్య లేదన్నారు. దరఖాస్తులను పరిశీలించి బహిరంగ విచారణ చేసి సమస్యను పరిష్కరించడం జరుగుతుందన్నారు. అప్పీల్ చేసే ఆప్షన్ ఈ చట్టంలో ఉందన్నారు. తద్వారా అన్యాయం జరిగిన రైతుకు న్యాయం జరిగేందుకు కృషి చేయొచ్చన్నారు. కార్యక్రమంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి, మహబూబాబాద్ ఆర్డీవో క్రిష్ణవేణి, జిల్లా వ్యవసాయ అధికారిని విజయనిర్మల, ఏడీ సర్వే ల్యాండ్ నరసింహామూర్తి, ఏడీఏ శ్రీనివాస్, డీపీవో హరిప్రసాద్, బయ్యారం తహసీల్దార్ విజయ, ఎంపీడీవో విజయలక్ష్మీతోపాటు అధికారులు, రైతులు పాల్గొన్నారు. కాగా, అంతకుముందు జమ్మూకశ్మీర్ పహల్గాం ఉగ్రదాడి లో మరణించిన వారికి నివాళులర్పించారు.

ధాన్యం కొనుగోళ్లను వేగవంతం చేయాలి

• తొర్రూరు ఆర్డీవో గణేష్

పెద్దవంగర, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ధాన్యం కొనుగోళ్ల ప్రక్రియను వేగవంతం చేయాలని తొర్రూరు ఆర్డీవో గణేష్ అధికారులను ఆదేశించారు. శనివారం మండల కేంద్రంతో పాటు చిట్యాలలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను ఆయన పరిశీలించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన ప్రతీ గింజను కొనుగోలు చేసేందుకు ప్రణాళికలను రూపొందించడం జరిగిందని, క్రయ విక్రయాల్లో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని అధికారులను కోరారు. 17శాతం కంటే తక్కువ తేమ ఉండేలా ధాన్యాన్ని అరబెట్టి తీసుకురావాలన్నారు. రైతులు పండించిన ధ్యానానికి మద్దతు ధర కల్పించేందుకు ప్రభుత్వం ఏర్పాటు చేసిన ధ్యానం కొనుగోలు కేంద్రాలను సద్వినియోగం చేసుకోవాలని రైతులను కోరారు. కేంద్రాల వద్ద రైతులకు ఇబ్బందులు కలుగకుండా మౌలిక సౌకర్యలు కల్పించాలని సిబ్బందికి సూచించారు. ప్రతీ సెంటర్‌కు టార్పాలిన్లను, ప్యాడీ క్లీనర్లను అందుబాటులో ఉంచాలన్నారు. గన్నీ సంచుల వివరాలను ముందస్తుగానే జిల్లా



మండలకేంద్రంలోని కేంద్రంలో ధాన్యం పరిశీలిస్తున్న ఆర్డీవో గణేష్

అధికారులకు తెలియజేయాలన్నారు. ఈకార్యక్రమంలో తహసీల్దార్ వీరగంటి మహేందర్, ఏవో గుగులోతు స్వామి నాయక్, పీఏసీఎస్ సీఈవో మురళి, ఏఈవోలు పాల్గొన్నారు.

కర్రెగుట్టల్లో కొనసాగుతున్న కూంబింగ్ ఆపరేషన్

వెంకటాపురం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): తెలంగాణ-ఛత్తీస్‌గఢ్ సరిహద్దుల్లోని కర్రెగుట్టల్లో కూంబింగ్ కొనసాగుతోంది. ఐదు రోజులుగా కేంద్ర బలగాలు ముమ్మరంగా గాలింపు చర్యల్లో నిమగ్నమై ఉన్నాయి. కర్రెగుట్టల్లో మావోయిస్టు అగ్రనేతలు సహా సుమారు వెయ్యి మందికిపైగా మావోయిస్టులు ఉన్నారనే కేంద్ర నిఘా వర్గాల సమాచారంతో బలగాలు చుట్టుముట్టాయి. కర్రెగుట్టల చుట్టూ మావోయిస్టులు అమర్చిన మందుపాతరలను తొలగించుకుంటూ కేంద్ర బలగాలు ముందుకు సాగుతున్నాయి. ఈ ఆపరేషన్‌లో పాల్గొన్న జవాన్లు వడదెబ్బకు గురవుతుండడంతో వారిని హెలీకాప్టర్‌లో బీజాపూర్, వెంకటాపురం వైద్యశాలలకు తరలించి వైద్యసహాయం అందిస్తున్నారు. ఐదు రోజులుగా కర్రెగుట్టలు కాల్పులతో దద్దరిల్లుతుండటంతో సమీప గిరిజన గ్రామాల ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని భయాందోళన చెందుతున్నారు. ఇదిలాఉండగా కర్రెగుట్టల్లో భారీ ఎన్‌కౌంటర్ జరిగిందని, అందులో 30 మంది మావోయిస్టులు మృతి చెందారని సోషల్ మీడియాలో ప్రచారం జరుగుతోంది.

ఉపాధి హామీ పనులను సద్వినియోగం చేసుకోవాలి

• ఎంపీడీవో కిన్నెర యాకయ్య



పని ప్రదేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో యాకయ్య

నర్సింహులపేట, ఏప్రిల్ 26(ఆంధ్రజ్యోతి): వలసలను నివారించేందుకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా అమలు చేస్తున్న మహాత్మాగాంధీ జాతీయ గ్రామాణ ఉపాధి హామీ పనులను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీవో కిన్నెర యాకయ్య అన్నారు. మండలంలోని పకీరతండా, ముంగిమడుగు, నర్సింహులపేట జీపీల పరిధిలో జరుగుతున్న ఎన్‌ఆర్‌ఈజీఎస్ పనులను ఆయన పరిశీలించారు. కూలీల సమస్యలను అడిగి తెలుసుకుని సలహాలు, సూచనలు ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్కు డిమాండ్ చేసిన ప్రతీ కూలీకి పని కల్పించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పంచాయతీ కార్యదర్శులు, ఈజీఎస్ టీఏలు కూలీలకు అందుబాటులో ఉండాలన్నారు. మస్టర్‌లో తప్పులు నమోదుచేసి నిధుల దుర్వినియోగానికి పాల్పడితే చర్యలుతప్పవన్నారు. కార్యక్రమంలో మేట్లు కిషన్, చందులాల్, వీరన్న, నరేష్‌రవి, శ్రీను పాల్గొన్నారు.

మండుతున్న ఎండలు

• జయశంకర్ భూపాలపల్లి జిల్లాలో అత్యధికం

• ఉక్కపోతతో ఉక్కిరిబిక్కిరి



హనుమకొండ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : ఉమ్మడి వరంగల్ జిల్లాలో ఎండలు మండిపోతున్నాయి. ఉక్కపోత ఎక్కువైంది. ప్రజలు ఉక్కిరిబిక్కిరి అవుతున్నారు. జయశంకర్ భూపాలపల్లి జిల్లా మహదేవపూర్ మండలం పద్దంపేటలో 42.5 డిగ్రీలు, ములుగు జిల్లా కన్నాయిగూడెంలో 42.4 డిగ్రీలు, హనుమకొండ జిల్లా కాజీపేటలో 42.2, వరంగల్ జిల్లా ఖానాపూర్ మండలం మంగళవారిపేటలో 41.2 డిగ్రీలు, జనగామ జిల్లాలోని చిల్పూర్ మండలం మల్కాపూర్‌లో 41.8 డిగ్రీలు, మహబూబాబాద్ జిల్లాలోని గార్లలో 41.9 డిగ్రీల ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి.

డిగ్రీ పరీక్షలు మళ్లీ వాయిదా

• వారం రోజుల్లో రెండుసార్లు పోస్ట్‌పోన్

• ప్రైవేట్ కళాశాలలు ఫీజులు చెల్లించకపోవడమే కారణం

• మళ్లీ ఎప్పుడనేది స్పష్టత ఇవ్వని కేయూ అధికారులు

కేయూ క్యాంపస్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కాకతీయ యూనివర్సిటీ డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు మళ్లీ వాయిదా పడ్డాయి. వారంరోజుల్లోనే వాయిదా పడడం ఇది రెండోసారి. మళ్లీ ఎప్పుడు నిర్వహిస్తారనే విషయంలో స్పష్టత ఇవ్వలేదు. దీంతో 1.70 లక్షల మంది విద్యార్థులు ఆందోళన చెందుతున్నారు. వాస్తవానికి మొదట ఏప్రిల్ 21 నుంచి పరీక్షలు నిర్వహిస్తామని ప్రకటించగా ప్రైవేట్‌కళాశాలల యాజమాన్యాలు పరీక్షల ఫీజును చెల్లించకపోవడంతో వాయిదా వేశారు. తర్వాత ఏప్రిల్ 28 నుంచి నిర్వహిస్తామని ప్రకటించారు. తీరా పరీక్షల తేదీ దగ్గర పడగా మళ్లీ రెండో దఫా వాయిదా వేసినట్లు అధికారులు ప్రకటించారు. శనివారం కేయూ పరిపాలన భవనంలో వీసీ ప్రొఫెసర్ కర్నాటి ప్రతాప్‌రెడ్డితో పాటు రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వల్లూరి రామచంద్రంలతో ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు భేటీకి ప్రయత్నించాయి. అయితే రాష్ట్ర ఉన్నతాధికారులతో హైదరాబాద్‌లో వీసీ సమావేశం ఉండటంతో ఆయన వెళ్లిపోయారు. దీంతో సాయంత్రం వరకు కూడా ప్రైవేట్ కళాశాలల యాజమాన్యాలు ఫీజులు చెల్లించలేదు. మరోవైపు ఆదివారం సెలవు.. తెల్లవారితే సోమవారమే పరీక్షలు ఉండడంతో పరీక్షల నిర్వహణపై ఉత్కంఠ నెలకొంది. ఉమ్మడి ఖమ్మం, ఆదిలాబాద్, వరంగల్ జిల్లాల్లోని విద్యార్థులు టెన్షన్‌గా ఎదురుచూశారు. వర్సిటీ ఉన్నతాధికారులు ఓకే అన్నట్లయితే శరవేగంగా విద్యార్థులకు పరీక్షల కేంద్రాల కేటాయింపుతో పాటు హాల్‌టికెట్ల జారీకి యుద్ధప్రాతిపదికగా విడుదల చేసేందుకు పరీక్షల నియంత్రణాధికారులు సిద్ధమయ్యారు. ఈలోగా పరీక్షలను మళ్లీ వాయిదా వేస్తున్నట్లు పరీక్షల నియంత్రణాధికారి ప్రొఫెసర్ కట్ల రాజేందర్, అదనపు పరీక్షల నియంత్రణాధికారులు డాక్టర్ ఎం.తిరుమలదేవి, డాక్టర్ వెంకయ్య ప్రకటించారు.

ప్రవేశ పరీక్షలపై ప్రభావం..

డిగ్రీ సెమిస్టర్ పరీక్షలు వాయిదా పడడంతో రానున్న ఏడాది పీజీతో పాటు ఇతర కోర్సుల ప్రవేశ పరీక్షలపై ప్రభావం పడనుంది. ఎడ్‌సెట్, ఐసెట్, లాసెట్‌తో పాటు ఇతర పోటీ పరీక్షలకు విద్యార్థులు ఇబ్బందులు పడే ప్రమాదం ఉంది. డిగ్రీ పరీక్షలు ఆలస్యంగా నిర్వహించడం వల్ల పేపర్ వాల్యూయేషన్‌తోపాటు ఇతర సమస్యలు ఏర్పడుతాయని విద్యావేత్తలు చెబుతున్నారు.

ఆశ్రమ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలి

▸▸ ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా



ముత్యాలమ్మగూడెం పాఠశాలలో మాట్లాడుతున్న చిత్రామిశ్రా

నెహ్రూసెంటర్(మహబూబాబాద్ జిల్లా), ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మహబూబాబాద్ ఆశ్రమ పాఠశాలలను సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాల్సిన బాధ్యత ప్రధానోపాధ్యాయులు, డిప్యూటీ వార్డెన్లదేనని ఏటూరునాగారం ఐటీడీఏ పీవో చిత్రామిశ్రా అన్నారు. శనివారం మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని బాలికల ఆశ్రమ పాఠశాల, ముత్యాలమ్మగూడెం బాలికల ఆశ్రమ పాఠశాలను సందర్శించారు. ఈసందర్భంగా మాట్లాడుతూ గిరిజనసంక్షేమశాఖ ఆధ్వర్యంలో నడుస్తున్న ఆశ్రమ పాఠశాలలు, వసతి గృహాలు పునఃప్రారంభం నాటికి విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మరమ్మతులు చేపట్టి సర్వాంగ సుందరంగా తీర్చిదిద్దాలని సూచించారు. పాఠశాలల్లోని వంటశాలలో విద్యార్థులకు ఇబ్బందులు కలుగకుండా అన్ని వసతులు సమకూర్చాలన్నారు. ఈ కార్యక్రమంలో డిప్యూటీ డైరెక్టర్ దేశీరాం నాయక్, హెచ్‌ఎం కోటేశ్వరి, నర్సయ్య, అనిత పాల్గొన్నారు.

ధాన్యం కేంద్రాల వద్ద నిఘా నేత్రాలు

తొర్రూరు రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మండలంలో పీఏసీఎస్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాల వద్ద భద్రతా చర్యల్లో భాగంగా అధికారులు నిఘా నేత్రాలను (సీసీ కెమెరాలు) శనివారం ఏర్పాటు చేశారు. గతంలో కేంద్రాల వద్ద పలు చోట్ల ధాన్యం దొంగతనానికి గురికావడం, టార్పాలిన్లు వంటివి మాయమవడం జరిగిందని, వాటిని నియంత్రించడానికి సీసీ కెమెరాలను ఏర్పాటు చేస్తున్నట్లు సెంటర్ నిర్వాహకులు తెలిపారు. రైతులు తమ ధాన్యాన్ని నిస్సందేహంగా తీసుకువచ్చి విక్రయించుకోవచ్చని పీఏసీఎస్ చైర్మన్ కాకిరాల హరిప్రసాద్ తెలిపారు.

వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి



రాజయ్య (ఫైల్)

మొగుళ్లపల్లి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): వడదెబ్బతో వ్యవసాయ కూలీ మృతి చెందిన సంఘటన జయశంకర్ భూపాలపల్లి జిల్లా మొగుళ్లపల్లి మండలంలో శనివారం మధ్యాహ్నం జరిగింది. కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. మండలంలోని మొట్లపల్లి గ్రామానికి చెందిన మిరుపూరి రాజయ్య(65) రోజువారీ లాగే ఉదయం కూలీ పనికి వెళ్లాడు. మధ్యాహ్నం వడదెబ్బ తగిలి అస్వస్థతకు గురై ఇంటికి వచ్చాడు. అనంతరం బహిర్భూమికి వెళ్లొచ్చాక మృతి చెందాడు. మృతుడికి భార్య, ఇద్దరు కుమారులు, కుమార్తె ఉన్నారు. నిరుపేద రాజయ్య కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని బీజేపీ మండల అధ్యక్షుడు వేణుగోపాల్‌రెడ్డి కోరారు.

భారత్ సమ్మిట్‌లో నూలు వడికిన ఎమ్మెల్యే



నోవాటెల్ హోటల్‌లో నూలు వడుకుతున్న మురళీనాయక్

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా హైదరాబాద్‌లోని నోవాటెల్‌లో శనివారం నిర్వహించిన భారత్ సమ్మిట్‌లో మానుకోట శాసనసభ్యులు భూక్య మురళీనాయక్ చరక తిప్పుతూ నూలు వడికారు. సమ్మిట్ ప్రదర్శన కోసం ఏర్పాటు చేసిన జాతిపిత మహాత్మాగాంధీ ఉపయోగించిన చరకను స్థానిక ఎమ్మెల్యే మురళీనాయక్ వడికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మురళీనాయక్ మాట్లాడుతూ... ప్రస్తుతం సమాజంలో అలజడులు, ఆర్థిక, సామాజిక అసమానతలు చోటుచేసుకుంటున్న నేపథ్యంలో అహింసా, సత్యం, సామాజిక న్యాయ సిద్ధాంతాన్ని భారత్ సమ్మిట్ ప్రపంచానికి మరోసారి పరిచయం చేస్తుందని చెప్పారు. ప్రపంచ శాంతి కోసం జరిగే భారత్ సమ్మిట్ చర్చలో పాల్గొనడం ఎంతో సంతోషంగా ఉందన్నారు.


సభా ప్రాంగణంలో తనిఖీలు చేస్తున్న భద్రతా సిబ్బంది


ఎల్కతుర్తిలో సిద్ధమైన సభా ప్రాంగణం

సందడిగా.. వడివడిగా..

నేడు బీఆర్ఎస్ రజతోత్సవ బహిరంగ సభ

- విస్తృత ఏర్పాట్లు చేసిన బీఆర్ఎస్ నాయకులు
- ఎల్కతుర్తి బాటలో 'గులాబీ' దళం
- ఎడ్లబండ్లు, ప్రభబండ్లు, ర్యాలీలు, పాదయాత్రలతో తరలుతున్న శ్రేణులు
- స్వాగత తోరణాలు, ఫ్లెక్సీలు, పార్టీ జెండాలతో ఓరుగల్లు రోడ్లు గులాబీమయం

(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

హనుమకొండ జిల్లా ఎల్కతుర్తి వద్ద నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభ సర్వం సన్నద్ధమైంది. ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు మిడిల్ పాయింట్‌గా ఉన్న ఎల్కతుర్తి వద్ద భారీ సభను నిర్వహిస్తున్నారు. 50వేల వాహనాలకు పార్కింగ్ చేసే విధంగా, రైతుల నుంచి సేకరించిన 1,216 ఎకరాల్లో 1,059 ఎకరాలను పార్కింగ్ కోసం కేటాయించారు. వివిధ ప్రాంతాల నుంచే వచ్చే బీఆర్ఎస్ కార్యకర్తలకు పార్కింగ్ పరంగా ఇబ్బందులు ఎదురుకాకుండా ఐదు జోన్లుగా విభజించారు. 2వేల మంది గులాబీ వలంటీర్లను నియమించారు. అలాగే 154ఎకరాల్లో సభా ప్రాంగణాన్ని ఏర్పాటు చేశారు. 500మంది కూర్చునే సామర్థ్యంతో వేదికను నిర్మిస్తున్నారు. వీఐపీల కోసం ప్రత్యేకంగా సభావేదిక వెనుక వైపు పార్కింగ్ స్థలాన్ని ఏర్పాటు చేశారు. అలాగే లక్షకు పైగా కుర్చీలను వేస్తున్నారు. భారీ సైజులో ఉన్న 23 ఎల్ఈడీ స్క్రీన్‌లను సభా ప్రాంగణంలో ఎక్కడ కూర్చున్న కనిపించేలా ఏర్పాటు చేస్తున్నారు. విద్యుత్ కోసం 200 జనరేటర్లను సమకూర్చుకున్నారు. మహిళలు, పరుషులకు వేర్వేరుగా 1,200కు పైగా తాత్కాలిక మరుగుదొడ్లను నిర్మించారు. వీటితో పాటు 12 వైద్యశిబిరాలను, ఆరు అంబులెన్స్‌లు, వాహనాలకు ట్రాఫిక్‌లో చెడిపోతే పక్కకు తీసుకెళ్లేందుకు 25టోయింగ్ వాహనాలను అందుబాటులో ఉంచారు. సభకు వచ్చేవారి కోసం 10లక్షల వాటర్ బాటిళ్లు, 15లక్షల మజ్జిగ బాటిళ్లను ఏర్పాటు చేస్తున్నారు. 200మొబైల్ పెట్రోలింగ్ వాహనాలు, 200సీసీ కెమెరాలు, 200 వైర్‌లెస్ సెట్లతో నిరంతరం పర్యవేక్షించేలా గులాబీ నేతలు ఏర్పాట్లు చేశారు. దారిపొడువునా భారీ ఫ్లెక్సీలు, కటౌట్లు, వాల్‌రైటింగ్‌తో గులాబీమయం చేశారు.

జన సమీకరణపై గులాబీ నేతలు ఫోకస్

రజతోత్సవ సభకు భారీగా జనసమీకరణ చేసేందుకు గులాబీ నేతలు తీవ్ర కసరత్తు చేశారు. ప్రధానంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లా నుంచి భారీగా జనసమీకరణ చేస్తున్నారు. ప్రతీ నియోజకవర్గం నుంచి 30వేల నుంచి 50వేల వరకు, సభకు సమీపంలో ఉన్న నియోజకవర్గాల్లో 70వేల వరకు జనాన్ని తరలించాలని లక్ష్యంగా పెట్టుకోగా.. ఒక్క ఉమ్మడి వరంగల్ జిల్లా నుంచే 2.50లక్షల మందిని తరలించనున్నట్లు తెలుస్తోంది. 2010 డిసెంబరు 16న వరంగల్‌లోని ప్రకాష్‌రెడ్డిపేటలో జరిగిన శంఖారావం సభకు రికార్డు స్థాయిలో జనం రగా.. ఆ సభకు దీటుగా లక్షలాది మందిని తరలిస్తామని బీఆర్ఎస్ నేతలు ప్రకటించారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా అన్ని నియోజకవర్గాలు, మండల కేంద్రాల్లో సన్నాహక సమావేశాలు పూర్తిచేయగా.. వర్ధన్నపేట, సూర్యాపేట జిల్లాల నుంచి ఇప్పటికే ఎడ్లబండ్లపై బీఆర్ఎస్ కార్యకర్తలు సభకు బయలుదేరారు. శుక్రవారం సిద్దిపేట జిల్లా కేంద్రం నుంచి మాజీ మంత్రి హరీష్‌రావు నేతృత్వంలో, ములుగు జిల్లా వెంకటాపూర్ నుంచి బీఆర్ఎస్ కార్యకర్తలు పాదయాత్రలతో సభకు వస్తున్నారు. వరంగల్ జిల్లా కొమ్మాల లక్ష్మీనర్సింహస్వామి ఆలయం నుంచి జాతర ప్రభబండ్లతో ఎల్కతుర్తి సభకు బయలుదేరారు. వివిధ మార్గాల్లో గులాబీ శ్రేణులు సభకు వస్తుండటంతో క్యాడర్ జోష్‌లో ఉంది. ఇప్పటికే బీఆర్ఎస్ 3వేల ఆర్టీసీ బస్సులను ఏర్పాటు చేసింది. వీటితో పాటు అందుబాటులో ఉన్న వాహనాల ద్వారా సభకు జనాన్ని తీసుకవచ్చేందుకు నేతలు దృష్టి సారించారు. సుమారు 30వేల నుంచి 40వేల వాహనాల్లో జనం తరలి వస్తారని అంచనా వేస్తున్నారు.

శ్రేణుల్లో జోష్ నింపేలా వేడుకలు

తెలంగాణ రాష్ట్ర సాధన కోసం ఏర్పడిన బీఆర్ఎస్ 14ఏళ్ల ఉద్యమంలో కీలక పాత్ర పోషించింది. ఆ తరువాత 2014లో తెలంగాణలో అధికారం చేపట్టి సుమారు పదేళ్ల పాలించింది. అయితే టీఆర్ఎస్ పేరును బీఆర్ఎస్‌గా మార్చుకుని 2023 నవంబరులో జరిగిన ఎన్నికల్లో పోటీ చేసి ఓటమి పాలైంది. తొలిసారిగా ప్రధాన ప్రతిపక్ష పాత్రను పోషిస్తోంది. అయితే అసెంబ్లీ ఎన్నికల ఓటమి నుంచి తేరుకోకముందే 2024 మే 13న జరిగిన పార్లమెంట్ ఎన్నికల్లో ఒక్క సీటు కూడా గులాబీ పార్టీ గెలుచుకోలేదు. దీంతో బీఆర్ఎస్ క్యాడర్ తీవ్ర నిరాశకు గురైంది. ఆ తరువాత వరంగల్, నల్గొండ, ఖమ్మం పట్టభద్రుల ఎమ్మెల్సీ స్థానానికి జరిగిన ఉపఎన్నికల్లో బీఆర్ఎస్ ఓటమిని ఎదుర్కొవాల్సి వచ్చింది. గత మార్చిలో జరిగిన వరంగల్, నల్గొండ, ఖమ్మం టీచర్స్ ఎమ్మెల్సీ, కరీంనగర్, నిజామాబాద్, ఆదిలాబాద్, మెదక్ పట్టభద్రులు, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ స్థానాలకు జరిగిన ఎన్నికల్లో బీఆర్ఎస్ దూరంగా ఉండటం గులాబీ శ్రేణులు మరింత నిరాశకు గురయ్యాయి. వరుసగా ప్రతి ఎన్నికల్లో ఓటమితో క్యాడర్‌లో కొన్ని చోట్ల చేజారుతుండగా, మరికొన్ని చోట్ల నిరాశలో ఉన్నారు. ఈ నేపథ్యంలో గులాబీ శ్రేణుల్లో జోష్ నింపి.. తెలంగాణలో మళ్లీ కారు పార్టీకి పూర్వవైభవం తీసుకవచ్చేందుకు బీఆర్ఎస్ అధిష్ఠానం రజతోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తుంది. సుమారు రూ.100కోట్లకు పైగా ఈ వేడుకల కోసం ఖర్చు చేస్తున్నట్లుగా ప్రచారం జరుగుతుంది. రాష్ట్రంలోని 12,750గ్రామాల నుంచి జనసమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నారు. ప్రతి ఇంటి నుంచి ఒక్కరినైనా సభకు తరలిస్తామని బీఆర్ఎస్ నేతలు పేర్కొంటున్నారు. సభ వేదికను కూడా వ్యూహాత్మకంగా ఉమ్మడి వరంగల్, కరీంనగర్, మెదక్ జిల్లాలకు సెంటర్ పాయింట్‌గా ఎల్కతుర్తిని ఎంపిక చేశారు. పార్టీ క్లిష్ట పరిస్థితుల్లో ఉన్నప్పుడు ఇలాంటి భారీ సభలు నిర్వహించి, ప్రజల చూపు తన వైపు తిప్పుకోవటంతో కేసీఆర్ దిట్ట అనే టాక్ ఉంది. టీఆర్ఎస్ ఆవిర్భావం తరువాత 2005, 2010, డిసెంబరు 16న వరంగల్‌లో శంఖారావం సభలతో తెలంగాణ ఉద్యమాన్ని ఉవ్వెత్తున ఎగిసి పడేలా చేశారన్న పేరుంది. అదే వ్యూహంతో ప్రస్తుతం వరుస ఓటములతో నిరాశలో ఉన్న క్యాడర్‌లో జోష్ నింపేందుకు రజతోత్సవ వేడుకలకు వరంగల్ కేంద్రంగా భారీ బహిరంగ సభ ద్వారా ప్రజల్లో మళ్లీ గులాబీ గుబాళించేలా కేసీఆర్ వ్యూహరచన చేశారనే చర్చ జరుగుతోంది. గులాబీ నేతలు కూడా తమ మధ్య ఉన్న విభేదాలను పక్కన పెట్టి సభను సవాల్‌గా తీసుకుని పని చేస్తున్నారనే అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

ఐదు జోన్లుగా పార్కింగ్

రజతోత్సవ సభకు వచ్చేవారి కోసం ఐదు జోన్లుగా విభజించి పార్కింగ్ కేంద్రాలను ఏర్పాటు చేశారు. మొదటి జోన్‌లో ఉమ్మడి వరంగల్, ఖమ్మం జిల్లాల నుంచి మల్లంపల్లి, గుడెప్పాడ్, వంగపహడ్, ఎన్‌హెచ్ 163 యూటర్న్ తీసుకుని హసన్‌పర్తి, ఎల్లాపూర్ నుంచి వాహనాల పార్కింగ్ కోసం హనుమకొండ-కరీంనగర్ జాతీయ రహదారి పక్కన ప్రాథమిక ఆరోగ్యం కేంద్ర వెనకాల పార్కింగ్ ఏర్పాటు చేశారు. అలాగే జోన్-2లో ఉమ్మడి నల్గొండ, రంగారెడ్డి, మహబూబ్‌నగర్, హైదరాబాద్ నుంచి వచ్చే వాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. జోన్-3లో జనగామ, స్టేషన్‌ఘనపూర్ నుంచి వచ్చేవారి కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. జోన్-4లో ఉమ్మడి కరీంనగర్, ఆదిలాబాద్‌తో పాటు వరంగల్‌లోని భూపాలపల్లి, పరకాల నుంచి వచ్చే వారి కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు. ఇక జోన్-5లో ఉమ్మడి మెదక్, నిజామాబాద్, ఆదిలాబాద్‌లోని కొంత భాగం నుంచి వచ్చేవాహనాల కోసం పార్కింగ్ ఏర్పాటు చేశారు.

నేడు గులాబీ రజతోత్సవం

తెలంగాణ స్వరాష్ట్ర సాధనే లక్ష్యంగా ఏర్పడిన బీఆర్ఎస్ 24 ఏళ్లు పూర్తి చేసుకుని ఆదివారం 25వ ఏటా అడుగు పెడుతోంది. ఈ క్రమంలో ఎల్కతుర్తి వేదికగా సిల్వర్ జూబ్లీ వేడుకలను నిర్వహించేందుకు నేతలు సన్నద్ధమయ్యారు. ఇక్కడ భారీ బహిరంగ సభను ఏర్పాటు చేయగా.. హనుమకొండ జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షుడు వినయ్‌భాస్కర్ ఆధ్వర్యంలో ఎమ్మెల్సీ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి పర్యవేక్షణలో మాజీ ఎమ్మెల్యేలు పెద్ది సుదర్శన్‌రెడ్డి, వొడితల సతీష్‌కుమార్ సభ ఏర్పాట్లు పూర్తి చేశారు. కేటీఆర్, హరీష్‌రావు, కవిత తదితర నేతలు సభ ఏర్పాట్లను పరిశీలించారు. ఆదివారం సాయంత్రం 4.30గంటలకు కేసీఆర్ హెలికాప్టర్ ద్వారా ఎల్కతుర్తిలోని సభ వేదిక వద్దకు చేరుకుంటారు. సాయంత్రం 5గంటల నుంచి రాత్రి 10గంటల వరకు సభ నిర్వహణకు అనుమతి ఉంది. భారీ ఎత్తును జనసమీకరణపై దృష్టి పెట్టిన నేతలు, వారు ఇంటికి చేరే వరకు పర్యవేక్షించే కమిటీని కూడా ఏర్పాటు చేశారు. మొత్తానికి రజతోత్సవ సభతో గులాబీ శ్రేణుల్లో ఉత్తేజాన్ని నింపాలని బీఆర్ఎస్ వ్యూహాత్మకంగా ముందుకెళుతోంది.

పోలీసుల భారీ బందోబస్తు

బీఆర్ఎస్ రజతోత్సవ సభకు వరంగల్ పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. 1,100మందికి పైగా పోలీసులు, ఇద్దరు డీసీపీలు, ఇద్దరు అదనపు డీసీపీలు, 8మంది ఏసీపీలు, 28మంది సీఐలు, ఆర్ఐలు, 66మంది ఎస్ఐలు, 137మంది ఏఎస్ఐలు, హెడ్ కానిస్టేబుళ్లు, 511మంది కానిస్టేబుళ్లు, 200మంది హోంగార్డులతో పాటు డిస్ట్రిక్ట్ గార్డ్స్ సిబ్బంది విధులు నిర్వహించనున్నారు.


గీసుగొండ నుంచి వస్తున్న బీఆర్ఎస్ ప్రభ బండి, కోలాటం ఆడుతున్న మహిళలు

ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా సమర్థవంతంగా పనిచేస్తాం

- బీఆర్ఎస్ పుట్టిందే వారి కోసం.. దేశానికి మార్గదర్శి కేసీఆర్
- దేవుళ్లపై ఒట్లేసి.. మోసం చేసిన కాంగ్రెస్
- మాజీ మంత్రి, ఎమ్మెల్యే హరీష్‌రావు
- ఎల్కతుర్తిలో సభ ఏర్పాట్ల పరిశీలన


సభాప్రాంగణం వద్ద విలేకరులతో మాట్లాడుతున్న హరీష్‌రావు, చిత్రంలో పలు జిల్లాల నేతలు

ఎల్కతుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): ఉద్యమ స్ఫూర్తితో తెలంగాణ రాష్ట్ర అభివృద్ధే ధ్యేయంగా ప్రజల కోసం పుట్టిన పార్టీ బీఆర్ఎస్ అని, ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా సమర్థవంతంగా పనిచేస్తామని మాజీ మంత్రి, సిద్దిపేట ఎమ్మెల్యే తన్నీరు హరీష్‌రావు పేర్కొన్నారు. ఆదివారం ఎల్కతుర్తిలో జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ మహాసభ ఏర్పాట్లను శనివారం ఆయన పరకిశీలించారు. ఆయన వెంట మాజీ మంత్రులు ఎర్రబెల్లి దయాకర్‌రావు, సత్యవతి రాథోడ్, ఎమ్మెల్యేలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, పాడి కౌశిక్‌రెడ్డి, ఎమ్మెల్సీలు తక్కెళ్లపల్లి రవిందర్‌రావు, పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బాలమల్లు, మాజీ ఎంపీ మాలోతు కవిత, మాజీ ఎమ్మెల్యేలు వొడితెల సతీష్‌కుమార్, పెద్ది సుదర్శన్‌రెడ్డి, గండ్ర వెంకట్రామిరెడ్డి, రాష్ట్ర నాయకులు ఆర్ఎస్ ప్రవీణ్‌కుమార్, నాగుర్ల వెంకన్న తదితరులు ఉన్నారు. సభ స్థలం, పార్కింగ్ ప్రదేశాలను పరిశీలించిన అనంతరం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో హరీష్‌రావు మాట్లాడారు. 14యేళ్ల ఉద్యమ పార్టీగా, పదేళ్ల అధికార పార్టీగా, ఏడాదిన్నర కాలంగా ప్రతిపక్ష పార్టీగా ప్రజలు ఏ పాత్ర ఇచ్చినా వారి ఆకాంక్ష మేరకు రాష్ట్రాభివృద్ధే ధ్యేయంగా పనిచేస్తామన్నారు. వరంగల్ జిల్లాకు భారీ బహిరంగ సభలు జరిపిన ఘనమైన చరిత్ర ఉందని, వరంగల్ మహాగర్జన చరిత్రలో నిలిచిందన్నారు. ఇప్పుడు ఎల్కతుర్తిలో రజతోత్సవ సభ జరుపుకోవడం ద్వారా మరో చరిత్రను తిరగరాస్తున్నామన్నారు. సమైక్య రాష్ట్రంలో కరువు కాటకాలకు, వలసలకు, ఆత్మహత్యలకు నిలయంగా ఉన్న తెలంగాణకు విముక్తి కలిగించింది బీఆర్ఎస్ పార్టీయేనని, నాడు ప్రతిపక్షంలో ఉండి కాంగ్రెస్ ప్రభుత్వం మెడలు వంచి ప్రజల పక్షాన నిలిచింది గులాబీ జెండాయేనన్నారు. ప్రజలకు మాయమాటలు చెప్పి కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, ఏడాదిన్నరలోనే ఆ పార్టీ చెప్పిన మాయమాటలు ప్రజలకు అర్థమయ్యాయయన్నారు. కేబినెట్‌లో ఉన్న నాయకులు అనాలోచితంగా ఎవరికి తోచినట్లు వారు మాట్లాడుతారని ఎద్దేవా చేశారు. గతంలో కేసీఆర్ ప్రభుత్వం రాష్ట్ర ఆదాయాన్ని ఏటా 12 శాతానికి పెంచి వచ్చిన సంపదను పేదలకు పంచిందని, కానీ కాంగ్రెస్ అధికారం చేపట్టిన ఏడాదిన్నర కాలంలోనే ప్రభుత్వ వైఫల్యం వల్ల సీఎం రేవంత్ రెడ్డి చేతగాని పాలన వల్ల సంపద పూర్తిగా కుంటు పడిందన్నారు. దేవుళ్ల మీద ఒట్లు వేసి, అంసెబ్లీలో 2025 మార్చి 31లోగా రైతులకు రైతు భరోసా అందజేస్తానని చెప్పి.. అటు దేవుళ్లను ఇటు అసెంబ్లీ.. మరోవైపు ప్రజలను మోసగించాడని మండిపడ్డారు. సమ్మక్క - సారమ్మ ఎత్తిపోతల ప్రాజెక్టులో కావలసినంత నీరు సమృద్ధిగా ఉన్నా చేతగాని కాంగ్రెస్ ప్రభుత్వం దేవాదుల పంపులను 45 రోజులు ఆలస్యంగా మోటార్లను ప్రారంభించడంతో సాగు నీరు సకాలంలో పంటలకు అందక లక్షల ఎకరాల్లో పంటలు ఎండి పోయాయని మండిపడ్డారు. దేవాదుల మోటార్లు ఆన్‌చేస్తే వచ్చే రూ.ఆరేడు కోట్ల నిర్వహణ ఖర్చు కోసం ఆరేడు వందల కోట్ల విలువైన పంటలను ఎండబెట్టారని మండిపడ్డారు. ఖమ్మం, నల్లగొండ, మహబూబ్‌నగర్‌లో నీళ్లుండి పంటలు ఎండ బెట్టిన చరిత్ర కాంగ్రెస్ ప్రభుత్వానిదన్నారు. బీఆర్ఎస్ పాలనలో 30 శాతానికి పైగానే నీటిని వాడుకున్నామన్నారు. కాంగ్రెస్ పాలనపై విసుగు చెందిన ప్రజలు పెద్ద ఎత్తున రజతోత్సవ సభకు తరలి రావడానికి సిద్ధమయ్యారు. ఎడ్లబండ్లు, సైకిళ్లు, పాదయాత్రలు, సొంత వాహనాల్లో స్వచ్ఛందంగా సభకు బయలుదేరుతున్నారన్నారు. పార్టీ పరంగా తరలించే జనం కాకుండా కాంగ్రెస్ ప్రభుత్వం వల్ల నష్టపోయిన యువత, రైతులు, వృద్ధులు, మహిళలు, యువతులు స్వచ్ఛంద సభకు తరలి వస్తున్నారన్నారు. రజతోత్సవ సభ ఏర్పాట్లను చూసే కాంగ్రెస్ నాయకులకు భయం పుట్టిందన్నారు. తిరిగి బీఆర్ఎస్ ప్రభుత్వం అధికారంలోకి రావడం ఖాయమన్నారు. ప్రజలను సభకు రాకుండా ప్రభుత్వం కుట్ర పన్నుతోందని, స్వీయ క్రమశిక్షణతో ట్రాఫిక్‌కు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ప్రజలను సభకు చేర్చాల్సిన బాధ్యత నాయకులు, కార్యకర్తలపై ఉందన్నారు. పోలీసుల్లా డ్యూటీ చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పార్టీ మండలాధ్యక్షుడు పిట్టల మహేందర్, చింతం సదానందం, నగేష్, ఎల్బూరి స్వామి, కడారి రాజు, శాలిని మహేందర్, బోయినపెల్లి యశోద రాజేశ్వర్‌రావు, కోరే రాజ్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

చరిత్రలో నిలిచేలా రజతోత్సవ సభ

- ప్రజలే స్వచ్ఛందంగా సభకు తరలొస్తున్నారు
- మళ్లీ కేసీఆర్‌ను సీఎంగా చూడాలనుకుంటున్నారు
- టీఆర్ఎస్.. బీఆర్ఎస్‌ది ఒకటే జెండా.. ఒకటే అజెండా
- అదే కారు గుర్తు.. కేసీఆరే అధ్యక్షుడు
- వరంగల్ సభతో రాష్ట్ర రాజకీయాల్లో సంచలన మార్పులు
- 'ఆంధ్రజ్యోతి'తో ఎమ్మెల్సీ, సభ ఇన్‌చార్జ్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి



(ఆంధ్రజ్యోతి ప్రతినిధి - వరంగల్)

చరిత్రలో నిలిచిపోయేలా బీఆర్ఎస్ రజతోత్సవ సభను నిర్వహిస్తున్నామని, ఇందుకోసం రాష్ట్రవ్యాప్తంగా భారీగా జనసమీకరణ చేస్తున్నామని ఎమ్మెల్సీ, సభ ఏర్పాట్ల ఇన్‌చార్జ్ పోచంపల్లి శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. ఆదివారం ఎల్కతుర్తిలో బీఆర్ఎస్ రజతోత్సవ సభ జరుగుతున్న నేపథ్యంలో అక్కడ జరుగుతున్న ఏర్పాట్ల గురించి ఆయన శనివారం 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు. ఈ సభకు ప్రజలు స్వచ్ఛందంగా తరలొస్తున్నారని, అందుకు సూర్యాపేట, ఇతరప్రాంతాల నుంచి ఎడ్లబండ్లలో, ర్యాలీలుగా జాతరకు వచ్చినట్లుగా తరలిరావడమే నిదర్శనమన్నారు.

ఉద్యమానికి వెన్నంటి ఉన్న ఓరుగల్లు వేదికగా..

తెలంగాణ ఉద్యమానికి ఊపిరిలూది.. వెన్నంటి ఉన్న ఓరుగల్లు వేదికగా సభ నిర్వహిసున్నామని, గతంలో వరంగల్‌లో జరిగిన అనేక సభలు సక్సెస్ అయ్యాయని గుర్తుచేశారు. అందుకే వరంగల్ అంటే కేసీఆర్‌కు ఓ సెంటిమెంట్ అని.. 2010 డిసెంబరు 16న ప్రకాష్‌రెడ్డిపేటలో నిర్వహించిన సభ దేశంలోనే అతిపెద్ద సభగా రికార్డుకెక్కిందన్నారు. ఆ సభకు దీటుగా రజతోత్సవ సభను కేసీఆర్ ఏర్పాటు చేశారన్నారు. 14ఏళ్లు అన్ని వర్గాలను కలుపుకొని ఉద్యమాలు, పోరాటాలు చేసి తెలంగాణను సాధించుకున్నామని, పదేళ్ల అధికార పార్టీగా, 16నెలలు ప్రతిపక్షంగా.. ప్రజలు ఎలా కోరుకుంటే అలా పని చేస్తున్నామన్నారు. అలాంటి పార్టీ 25ఏట అడుగు పెడుతున్న వేళ రాష్ట్ర ప్రజలు, 60లక్షల గులాబీ సైన్యం పండుగ జరుపుకొనేందుకు సిద్ధమవుతున్నారన్నారు. ఎల్కతుర్తి వద్ద 1,250 ఎకరాల్లో ఏర్పాట్లు చేశామని, 169ఎకరాల్లో సభ ప్రాంగణం ఉంటుందన్నారు. వరంగల్, హైదరాబాద్, రంగారెడ్డి, నల్లగొండ, ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల వైపు నుంచి వచ్చే వారి కోసం వరంగల్- ఎల్కతుర్తి హైవేకు సమీపంలో 600ఎకరాల్లో, కరీంనగర్, ఆదిలాబాద్ జిల్లాల నుంచి వచ్చే వారి కోసం కరీంనగర్- ఎల్కతుర్తి హైవే దగ్గర 200ఎకరాల్లో పార్కింగ్ ఏర్పాటు చేసినట్టు తెలిపారు. మెదక్, నిజామాబాద్, రంగారెడ్డిలోని కొంత భాగం నుంచి వచ్చే వాహనాల కోసం సిద్ధిపేట- ఎల్కతుర్తి హైవేకు సమీపంలో 200ఎకరాల్లో పార్కింగ్ ఇచ్చామన్నారు. ఇక మజ్జిగ, వాటర్ బాటిళ్లను అందుబాటులో ఉంచామని, మహిళలు, పురుషులకు వేర్వేరుగా 1100 తాత్కాలిక మరుగుదొడ్లు ఏర్పాటు చేశామన్నారు. 2వేల మంది గులాబీ వలంటీర్లు పర్యవేక్షిస్తారని, 12చోట్ల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, సిబ్బందితో పాటు 12మంది వైద్యులు, 10అంబులెన్సులు, 200సీసీ కెమెరాలు, 23 ఎల్ఈడీ భారీ స్క్రీన్లు, 25టోయింగ్ వాహనాలను ఏర్పాటు చేశామన్నారు.

జాతరకొచ్చినట్టు వస్తున్నారు..

రజతోత్సవ సభకు రాష్ట్రం నలుమూలల నుంచి భారీగా జనాన్ని సమీకరించేలా ప్రణాళిక చేసుకున్నామని, వరంగల్, కరీంనగర్, ఖమ్మం, నల్లగొండ, మెదక్ ఉమ్మడి జిల్లాల నుంచి ఎక్కువ సంఖ్యలో జనసమీకరణ చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామన్నారు. మిగిలిన జిల్లాలు, ప్రాంతాల నుంచి కూడా లక్షలాదిగా జనం తరలి వచ్చే అవకాశం ఉందని, ఇప్పటికే మేడారం జాతరకు వచ్చినట్లుగా ఎడ్లబండ్లు, ప్రభ బండ్లు, పాదయాత్రలతో ప్రజలు బయలుదేరటం కేసీఆర్‌పై ప్రేమ చెక్కుచెదరలేదనటానికి నిదర్శనంగా నిలుస్తుందన్నారు. సభలో కేసీఆర్ ప్రసంగం కోసం యావత్తుదేశం ఎదురుచూస్తోందని, ఆయనే మళ్లీ సీఎం కావాలన్న అకాంక్ష ప్రజల్లో బలంగా ఉందన్నారు. ఇప్పటికే ఏ సమస్య వచ్చిన ప్రజలు తెలంగాణ భవన్ తలుపులు తడుతున్నారని, వరంగల్ సభ ప్రజల గుండెల్లోని ఉద్యమ జ్ఞాపకాలకు వేదిక కాబోతుందని అభివర్ణించారు. ఇక టీఆర్ఎస్, బీఆర్ఎస్ వేర్వేరు కాదని, తెలంగాణ ప్రజల గుండె చప్పుడైన టీఆర్ఎస్‌ది ఒకే జెండా.. ఒకటే అజెండా అని స్పష్టం చేశారు. పేరులో అక్షరమే మారింది కానీ, అదే కారు గుర్తు... అధ్యక్షుడు కేసీఆరేనని, ప్రజలకు ఈ విషయంలో స్పష్టత ఉందన్నారు. కానీ, కాంగ్రెస్ నేతలు అర్థం లేని మాటలు మాట్లాడుతున్నారన్నారు. పాతికేళ్ల గులాబీ జెండా పండుగ.. తెలంగాణ ప్రజల ఇంటి పార్టీ పండుగన్నారు. ఇందులో ఎవరికీ ఎలాంటి కన్‌ఫ్యూజన్ అవసరం లేదన్నారు.

కాంగ్రెస్ మోసగించిందని గుర్తించారు..

గతంలో, ఇప్పుడు కాంగ్రెస్‌ను నమ్మి తాము మోసపోయామని ప్రజలు గుర్తించారని, బీఆర్ఎస్‌ను ఓడించి కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొస్తే, ఇచ్చిన హామీలను కూడా నెరవేర్చడం లేదన్న ఆవేదన వారిలో ఉందని ఎమ్మెల్సీ శ్రీనివాసరెడ్డి పేర్కొన్నారు. అందుకే కేసీఆర్‌ను చూడాలని, ఆయన ప్రసంగం వినాలనే ఆసక్తి వారిలో పెరిగిందని, సభకు స్వచ్ఛందంగా వచ్చేందుకు వారే ఏర్పాట్లు చేసుకుంటున్నారన్నారు.

టీడీపీ, బీఆర్ఎస్‌లే నిలబడ్డాయి..

ఉమ్మడి రాష్ట్రంలో అనేక ప్రాంతీయ పార్టీలు పుట్టుకొచ్చినా.. కొన్నాళ్లకే కనుమరుగయ్యాయని, కానీ పాతికేళ్లపాటు ప్రజల మద్దతుతో నిలిచిన పార్టీలు రెండే ఉన్నాయన్నారు. వాటిలో ఒకటి ఎన్‌టీఆర్ స్థాపించిన టీడీపీ అయితే.. మరొకటి కేసీఆర్ ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ మాత్రమేనన్నారు. దేశంలో ఏ పార్టీకి లేని చరిత్ర బీఆర్ఎస్‌కు ఉందని, అన్ని పార్టీలు రాజకీయాలు, కులాలు, ఇతర వాదాలతో ఏర్పడితే.. బీఆర్ఎస్ మాత్రం ఉద్యమం కోసం పురుడు పోసుకుందని గుర్తుచేశారు. ప్రత్యేక రాష్ట్రం సాధించడమే ఎజెండాగా ఆవిర్భవించిందని, ఆ తరువాత పదేళ్లు బంగారు తెలంగాణ లక్ష్యంగా పాలన అందించిందని, ప్రజల అకాంక్ష మేరకు.. వారు ఏ పాత్ర ఇస్తే అందుకు అనుగుణంగా పని చేస్తుందన్నారు.

ఏడాదంతా ఉత్సవాలు

రజతోత్సవ సభ తరువాత రాష్ట్ర రాజకీయాల్లో పెనుమార్పులు వస్తాయని, బీఆర్ఎస్‌కు గెలుపోటములు కొత్తకాదని, 24ఏళ్లలో ఎన్నో ఎత్తుపల్లాలను చూసిందన్నారు. ఇక ఈ ఏడాదంతా ఉత్సవాలు నిర్వహిస్తామని, రాష్ట్ర వ్యాప్తంగా ప్రత్యేక కార్యక్రమాలను నిర్వహిస్తామన్నారు. రాష్ట్రంతో పాటు వివిధ దేశాలు, ప్రాంతాల్లో కూడా బీఆర్ఎస్‌కు అభిమానులు, కార్యకర్తలున్నారని, వారు కూడా ఆయా ప్రాంతాల్లో ఈ వేడుకలు నిర్వహిస్తారని తెలిపారు. జిల్లాలు, నియోజకవర్గాల వారీగా కూడా ఉత్సవాలు నిర్వహించేలా అధిష్ఠానం కార్యచరణ రూపొందిస్తోందని పోచంపల్లి వివరించారు.

రామప్పను సందర్శించిన మిస్ ఇండియా

వెంకటాపూర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : యునెస్కో గుర్తింపు పొందిన ములుగు జిల్లా వెంకటాపూర్ మండలంలోని రామప్ప దేవాలయాన్ని 2023 మిస్ ఇండియా విజేత నందిని గుప్తా శనివారం సందర్శించారు. ఈ సందర్భంగా అర్చకులు ఆమెకు స్వాగతం పలికారు. అనంతరం నందినిగుప్తా రామలింగేశ్వరునికి ప్రత్యేక పూజలు చేశారు. పర్యాటక శాఖ జిల్లా అధికారి శివాజీ నేతృత్వంలో టూరిజం గైడ్లు ఆమెకు రామప్ప ఆలయ చరిత్ర, రామప్పలోని మదనిక సాలబంజికల చరిత్రను వివరించారు. అద్భుత నిర్మాణ రీతులు, అపురూప శిల్పా సంపదకు నెలవైనా రామప్ప ఆలయం జగద్విఖ్యాతం, కాకతీయుల నిర్మాణాల్లో తలమానికం. రాళ్లను కరిగించి పోతపోసి మలిచిన శిల్పాలను ఆమె ఆసక్తిగా తిలకించారు. అయితే మే 7 నుంచి 31 వరకు హైదరాబాద్ వేదికగా మిస్ వరల్డ్ పోటీలు జరనుండగా.. ఈ పోటీల్లో పాల్గొనే వివిధ దేశాల సుందరీమణులకు రాష్ట్రంలోని పలు ప్రముఖ పర్యాటక ప్రాంతాలను చూపేలా ప్రభుత్వం కార్యాచరణ చేసింది. అందులో భాగంగా మే 14న సుందరీమణులు రామప్పకు రానున్నారు. కానీ ముందుగానే రాజస్థాన్‌కు చెందిన మిస్ఇండియా రామప్పను సందర్శించడం ప్రాధాన్యం సంతరించుకుంది.

ప్రత్యేక పూజలు చేసిన నందినిగుప్తా


రామప్ప సన్నిధిలో మిస్ ఇండియా నందినిగుప్తా

సమ్మర్ క్యాంపుల నిర్వహణకు ఏర్పాట్లు చేయండి

బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

వరంగల్ కార్పొరేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : సమ్మర్ కోచింగ్ క్యాంపుల నిర్వహణలో భాగంగా క్రీడల నిర్వహణకు విస్తృత ఏర్పాట్లు చేయాలని బల్దియా కమిషనర్ అశ్విని తానాజీ వాకడే అధికారులకు సూచించారు. శనివారం కమి షనర్ బల్దియా కార్యాలయం సమీపంలో నిర్మాణం జరుగుతున్న స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనులను క్షేత్రస్థాయిలో పరిశీ లించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడారు. మే 1 నుంచి 31 వరకు నిర్వహించే స్పోర్ట్స్ సమ్మర్ క్యాంపులలో క్రీడాకారులకు కావలసిన అన్ని రకాల మౌళిక సదుపాయాలు అందించాలన్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు రవికుమార్, మాధవీలత, కార్తీక్‌రెడ్డి, రాజ్‌కుమార్, ఏఈ రాగుల శ్రీనివాస్, స్టేడియం సిబ్బంది భరత్, శ్రీకాంత్, నరేష్ తదితరులు పాల్గొన్నారు.


స్విమ్మింగ్ పూల్ నిర్మాణ పనుల వివరాలను తెలుసుకుంటున్న కమిషనర్ అశ్విని తానాజీ వాకడే

పప్పు దినుసులు వేసుకోవాలి : ఏడీఆర్

మహబూబాబాద్ అగ్రికల్చర్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రైతులు పత్తి, మిర్చి, వరి లాంటి పంటలు వేస్తున్నారని, ఆ పంటలపై వచ్చే లాభనష్టాలను అంచనాలు వేయలేకపోతున్నారని, ఆ పంటలతో పాటు పప్పు దినుసులైన కందులు, వేరుశనగ, నువ్వులు, పచ్చజొన్న లాంటి పంటలను సాగు చేసుకోవాలని వరంగల్ ప్రాంతీయ పరిశోధనస్థానం అసోసియేట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ (ఏడీఆర్) డాక్టర్ ఉమారెడ్డి రైతులకు సూచించారు. తెలంగాణ కేవీకే ఆధ్వర్యంలో వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ పథకం కింద మండలంలోని కంబాలపల్లిలో శనివారం రైతు సదస్సు జరిగింది.


విద్యార్థులు తయారు చేసిన వ్యవసాయ పరికరం వద్ద మాట్లాడుతున్న ఏడీఆర్ ఉమారెడ్డి

ఈ సందర్భంగా ఉమారెడ్డి మాట్లాడుతూ గత మూడు నెలలుగా వరంగల్ వ్యవసాయ కళాశాల విద్యార్థులు కంబాలపల్లి, బయ్యారం, కొల్లాపురం, కల్వల, అమీనాపురం, అయ్యగారిపల్లి, ఇనుగుర్తి గ్రామాల్లో గ్రామీణ వ్యవసాయ కృషి అనుభవ పథకం కింద 32 మంది విద్యార్థులు వ్యవసాయ దాని అనుబంధ సంఘాల పంటలు దిగుబడి, రైతుల అనుభవాలను తెలుసుకున్న అనంతరం చివరి రోజు కంబాలపల్లిలో ఏర్పాటు చేసిన రైతు సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ సమావేశంలో మల్యాల కేవీకే కోఆర్డినేటర్ డాక్టర్ మాలతి, శాస్త్రవేత్తలు కిశోర్‌కుమార్, రాంబాబు, వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్లు యశస్విని, మానస పాల్గొన్నారు.

ఘర్షణ కేసులో ముగ్గురిపై కేసు నమోదు

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి): కంబాలపల్లిలో ఘర్షణ కేసులో ముగ్గురిపై కేసు నమోదు చేసినట్లు రూరల్ ఎస్సై దీపికా రెడ్డి శనివారం తెలిపారు. ఎస్సై తెలిపిన వివరాల ప్రకారం. కంబాలపల్లి గ్రామానికి చెందిన సందె వీరన్న, కొమిరెల్లి, ఆవుల రాకేష్‌లు అదే గ్రామానికి చెందిన కారింగుల దాసుపై శుక్రవారం రాత్రి ఘర్షణ పడి అతని ద్విచక్ర వాహనంలో ఉన్న బొడ్రాయి ఉత్సవాల నిర్వహణ కోసం వసూలు చేసిన రూ.1.50 లక్షల నగదును తీసుకున్నట్లు చెప్పారు. దాసు ఇచ్చిన ఫిర్యాదు మేరకు ముగ్గురిపై కేసు నమోదు చేసి దర్యాప్తు జరుపుతున్నట్లు చెప్పారు.

ముఖం చాటేస్తే వేతనం కట్

- కేసముద్రం మార్కెట్లో ఫేస్ రికగ్నేషన్ హాజరుకు సన్నాహాలు
- వచ్చేనెల 1 నుంచి ప్రారంభం

కేసముద్రం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం వ్యవసాయ మార్కెట్లో ఉద్యోగులు, సిబ్బంది హాజరును మరింత పారదర్శకంగా సమర్థవంతంగా నిర్వహించేందుకు ఫేస్ రికగ్నేషన్ (ముఖగుర్తింపు) హాజరును వినియోగించనున్నారు. మార్కెట్లో ఎనిమిది మంది రెగ్యులర్ ఉద్యోగులు, 16 మంది సెక్యూరిటీ గార్డులు, ఎనిమిది మంది ఔట్‌సోర్సింగ్ అటెండర్లు, టైన్ వాచ్‌మెన్లు, తొమ్మిది మంది డేటా ఎంట్రీ ఆపరేటర్లు, ముగ్గురు దినసరి వేతనం విధానంలో మొత్తం 44 మంది ఉద్యోగులు పని చేస్తున్నారు. వీరందరికీ గతంలో బయోమెట్రిక్ హాజరు విధానం ఉన్నప్పటికీ సాంకేతిక సమస్యలతో మరుగున పడిపోయింది. తాజాగా ప్రభుత్వం అన్ని శాఖల్లో హాజరు విషయంలో నూతన సాంకేతిక పరిజ్ఞానాన్ని వినియోగించాలనే ఉద్దేశంతో ఫేస్ రికగ్నేషన్‌కు శ్రీకారం చుట్టింది. ఇందుకోసం రూ.22వేలను వెచ్చించి ఫేస్ రికగ్నేషన్ పరికరాన్ని మార్కెట్ కార్యాలయంలో ఏర్పాటు చేశారు. ఇందులో తొలుత ప్రతీ సిబ్బంది తమ ముఖాన్ని నమోదు చేసే ప్రక్రియను రెండు రోజులుగా చేపడుతున్నారు.


మార్కెట్లో ఫేస్ రికగ్నేషన్ హాజరు యంత్రంలో తమ ముఖవివరాలను నమోదు చేస్తున్న సిబ్బంది

ముఖం చూపిస్తేనే హాజరు..

మార్కెట్లో ఏర్పాటు చేసిన ఈ ఫేస్ రికగ్నేషన్ యంత్రం సిబ్బంది కార్యాలయానికి వచ్చి, వెళ్లేటప్పుడు ముఖాన్ని చూపించగానే క్షణాల్లో గుర్తించి హాజరును రిజిష్టర్ చేస్తుంది. ఈ యంత్రాన్ని కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌కు అనుసంధానించి రాష్ట్రస్థాయి ఉన్నతాధికారులకు సైతం ఎప్పటికప్పుడు సమాచారం అందే విధంగా ఏర్పాటు చేశారు. దీంతో ఏ రోజుకారోజు ఇక్కడి మార్కెట్లో సిబ్బంది హాజరును హైదరాబాద్‌లోని ఉన్నతాధికారులు సైతం పర్యవేక్షించే అవకాశం కలుగుతుంది. ఈ విధానంలో ఉద్యోగి తప్పనిసరిగా ఈ యంత్రం ముందుకు వచ్చి ముఖాన్ని చూపిస్తేనే హాజరును నమోదు చేస్తుంది. మే 1 నుంచి సిబ్బంది హాజరు పూర్తిగా ఈ యంత్రం ఇచ్చే సమాచారం ఆధారంగానే ఆధారంగానే పరిగణించనున్నట్లు మార్కెట్ ప్రత్యేక హోదా కార్యదర్శి అమరలింగేశ్వర్‌రావు తెలిపారు. ఈ హాజరు ద్వారానే వేతనాలను చెల్లించడం జరుగుతుందని స్పష్టం చేశారు. 'ముఖం' చాటేస్తే వేతనంలో కోత పడుతుందని తెలుస్తోంది. ఏదేమైనా సిబ్బంది హాజరు విధానంలో మరింత జవాబుదారితనాన్ని తెచ్చేందుకు మార్కెటింగ్ శాఖ అత్యాధునిక సాంకేతికతను వినియోగిస్తోందనేది వాస్తవం.

సీఎంగా మళ్లీ కేసీఆర్‌నే ప్రజలు కోరుకుంటున్నారు

- మాజీ మంత్రి రెడ్యానాయక్

చిన్నగూడూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో ముఖ్యమంత్రిగా మళ్లీ కేసీఆర్ రావాలని ప్రజలు కోరుకుంటున్నారని, అందులో భాగంగానే తిరిగి సొంతగూటికి వస్తున్నారని మాజీ మంత్రి డీఎస్ రెడ్యానాయక్ అన్నారు. శనివారం ఉగ్గంపల్లిలోని మాజీమంత్రి స్వగృహంలో దుమ్మాతండాకు చెందిన 10 కుటుంబాలు జిల్లా బీఆర్ఎస్ అధ్యక్షురాలు మాలోతు కవిత, రెడ్యానాయక్ సమక్షంలో కాంగ్రెస్ నుంచి బీఆర్ఎస్‌లో చేరగా వారికి కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమంలో జిల్లా నాయకులు ఎండీ ఆయూబ్ పాష, మాజీ ఎంపీటీసీ ఉదయమ్మ కోమురెల్లి, మాజీ సర్పంచ్ పూలమ్మ మల్లేషం, బీఆర్ఎస్ గ్రామశాఖ అధ్యక్షుడు యాకీ, గంగరాజు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్ల సర్వే పారదర్శకంగా ఉండాలి

- అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో

మరిపెడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : జిల్లా వ్యాప్తంగా జరుగుతున్న ఇందిరమ్మ ఇళ్ల సర్వే పారదర్శకంగా నిర్వహించాలని, రాజీవ్ యువ వికాసం ఎంపిక సర్వే సత్వరమే పూర్తి చేయాలని అదనపు కలెక్టర్ లెనిన్‌వత్సల్ టొప్పో అధికారులను ఆదేశించారు. శనివారం ఆయన మరిపెడ విలేజీలోని ఇందిరమ్మ ఇళ్ల సర్వేను పరిశీలించారు. అనంతరం మరిపెడ మునిసిపల్ ఆఫీస్ తనిఖీ చేసి రాజీవ్ యువవికాస ఎంపిక సర్వే వివరాలను తెలుసుకున్నారు. ఇప్పటి వరకు వార్డువైజ్‌గా సర్వే చేపట్టకపోవడంపై అధికారులను మందలించారు. ఎస్సీ కార్పొరేషన్ ఈడీ శ్రీనివాస్‌రావు, మరిపెడ మునిసిపల్ కమిషనర్ ఏ.నరేశ్‌రెడ్డి, మునిసిపల్ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు ప్రాధాన్యం : ఝాన్సీరెడ్డి


సమావేశంలో మాట్లాడుతున్న ఝాన్సీరెడ్డి

తొర్రూరు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): మహిళా సాధికారతే కాంగ్రెస్ ప్రభుత్వ లక్ష్యమని పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి హనుమాండ్ల ఝాన్సీరెడ్డి అన్నారు. శనివారం తొర్రూరు పార్టీ కార్యాలయంలో మహిళా కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. రాష్ట్ర ప్రభుత్వం మహిళా పక్షపాత ప్రభుత్వమని, మహిళల సంక్షేమం కోసం అనేక పథకాలు ప్రవేశపెట్టిందన్నారు. బస్సుల్లో ఉచిత ప్రయాణం, ఇందిరమ్మ ఇండ్లు, స్వయం సహాయక సంఘాలకు రుణాలు, సన్న బియ్యం పంపిణీ, గృహజ్యోతి ద్వారా 200 యూనిట్ల ఉచిత విద్యుత్, 500లకే వంటగ్యాస్ లాంటి పథకాలు అమలు చేస్తోందని తెలిపారు. ఆడబిడ్డలకు అండగా నిలుస్తున్న ప్రభుత్వాన్ని రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలే ముందుండి ప్రజా ప్రతినిధులను గెలిపించాలన్నారు. మహిళా నాయకురాలు పింగిలి ఉష, ప్రశాంతి, మహిళా గ్రామ కోఆర్డినేటర్లు పాల్గొన్నారు.

పహల్గాం మృతులకు మునిసిపల్ సిబ్బంది నివాళులు


పహల్గాం ఉగ్రదాడి ఘటనకు సంతాప సూచికంగా కొవ్వొత్తులు వెలిగించి నివాళులర్పిస్తున్న మునిసిపల్ సిబ్బంది

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్26 (ఆంధ్రజ్యోతి) : కశ్మీర్‌లోని పహల్గాంలో ఉగ్రవాదులు జరిపిన కాల్పుల్లో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ మహబూబాబాద్‌లో శనివారం రాత్రి మునిసిపల్ సిబ్బంది కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు. స్థానిక మునిసిపల్ కార్యాలయం నుంచి నెహ్రూసెంటర్ వరకు ర్యాలీ చేపట్టి అక్కడ కొవ్వొత్తులు వెలిగించి మృతులకు నివాళులర్పించారు. దాడులకు పాల్పడిన ఉగ్రవాదులను కఠినంగా శిక్షించాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో తండా సత్యనారాయణ, క్రాంతి, శ్రీను, ఇరుకుల శ్రీనివాస్, పి.కృష్ణ, ఆకుల కిషోర్, నర్సింహారావు, కేశవరావు పాల్గొన్నారు.

వివిధ మతాల ఆధ్వర్యంలో

కేసముద్రం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : కేసముద్రం గాంధీ సెంటర్‌లో శుక్రవారం రాత్రి వివిధ మతాల ఆధ్వర్యంలో కాశ్మీర్ ఉగ్రదాడిలో మృతి చెందిన వారికి నివాళులర్పిస్తూ కొవ్వొత్తులను వెలిగించారు. కార్యక్రమంలో పాస్టర్ జాన్ మహబూబ్, మార్కెట్ కమిటీ సభ్యులు ఎండీ.అయూబ్‌ఖాన్, చింతకుంట్ల యాదగిరి, పుల్లెంల శ్రీధర్, లాల్‌సింగ్, జోసెఫ్, జాన్‌వెస్లీ, రాజు, రాజేంద్రప్రసాద్ పాల్గొన్నారు.

వైభవంగా మాకుల వేంకటేశ్వరుడి 'పారువేట'

- ముగిసిన మహా ఘట్టం

మరిపెడ, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మరిపెడ మాకుల వేంకటేశ్వరస్వామి 'పారువేట' ఘట్టం శనివారం మహా వైభవంగా నిర్వహించారు. రెండు తెలుగు రాష్ట్రాల్లోని వివిధ ప్రాంతాల నుంచి భక్తులు పెద్దఎత్తున తరలివచ్చారు. వేంకటేశ్వరుడి దర్శనం కోసం భక్తులు మోకరిల్లారు. లోక కల్యాణార్థం, దుష్టశిక్షణ, శిష్టరక్షణ కోసంమాకుల వేంకటేశ్వరస్వామి అలివేలు మంగా-పద్మావతి గోదా సమేత అశ్వవాహనంపై అడవికి పారువేటకు వెళ్లి భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ సందర్భంగా దేవతామూర్తులకు వేదపండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. వేంకటేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలు ప్రతీ సంవత్సరం చైత్ర శుద్ధ ఏకాదశి నుంచి చైత్రశుద్ధ బహుల త్రయోదశి వరకు అంగరంగ వైభవంగా రోజొక్క తీరుతో ఆలయ పూజారులు వేద పండితులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. పారువేట సందర్భంగా రైతులు తమ ఎండ్లబండ్లు, ట్రాక్టర్లతో ఆలయం చుట్టూ ప్రదక్షిణలు చేసి మొక్కులు చెల్లించుకున్నారు.


పారువేటకు బయలెల్లిన మాకుల వేంకటేశ్వరుడు

స్వామి వారిని దర్శించుకున్న ప్రభుత్వ విప్

ప్రభుత్వవిప్, డోర్నకల్ ఎమ్మెల్యే జాటోత్ రాంచంద్రునాయక్ వేంకటేశ్వర స్వామికి, మ్యారియమ్మ యాడీకి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్టేట్ ఫైనాన్స్ కార్పొరేషన్ డైరెక్టర్ మాలోత్ నెహ్రూతో కలిసి ఎమ్మెల్యే మిఠాయి దుకాణాలకు వెళ్లి స్వీట్లు కొన్నారు. పట్టణ కాంగ్రెస్ అధ్యక్షుడు తాజ్‌ద్దీన్, మైనార్టీ నేత అఫ్జల్ తదితరులు ఉన్నారు.

- జాతరలో ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటు చేసుకోకుండా సీఐ రాజ్‌కుమార్ గౌడ్ సర్కిల్ పరిధిలోని ఎస్సైలు, పోలీస్ సిబ్బందితో భారీబందోబస్తు ఏర్పాటు చేసి పర్యవేక్షించారు. మరిపెడ పీహెచ్‌సీ డాక్టర్ రవినాయక్ నేతృత్వంలో వైద్యశిబిరం ఏర్పాటు చేశారు. వాసవీక్లబ్ ఆధ్వర్యంలో భక్తులకు మజ్జిగ, చల్లటి తాగునీరు సరఫరా చేశారు.

మైనర్లకు వాహనాలు ఇవ్వొద్దు

కురవి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : పిల్లలకు వాహనాలు నడిపేందుకు ఇస్తే వారి తల్లిదండ్రులు సెక్షన్ 199ఎ మోటార్ వెహికిల్ యాక్ట్ ప్రకారం శిక్షార్హులని చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యుడు డాక్టర్ పరికిపండ్ల అశోక్ అన్నారు. శనివారం కురవి నుంచి ఖమ్మం వెళ్లే రహదారిలో ఏకలవ్య గురుకులం వద్ద పోలీసుల ఆధ్వర్యంలో 18 సంవత్సరాల్లోపు పిల్లల బైక్, వాహన తనిఖీ కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా 18 సంవత్సరాల్లోపు పిల్లలు బైక్ నడపడాన్ని గమనించి వారికి, వారి తల్లిదండ్రులను పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు. మరోసారి ఇటువంటి తప్పులు జరుగకుండా క్షమాపణ లేటరు తీసుకున్నారు. చిన్నారులకు వాహనాలు ఇవ్వడం తల్లిదండ్రుల తప్పేనని, ఎటువంటి పరిస్థితుల్లో మైనర్లకు వాహనాలు ఇవ్వకూడదని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో ఏఎస్సై వెంకన్న, హెడ్ కానిస్టేబుల్ ఉపేందర్, కానిస్టేబుల్ వీరన్న, సమ్మయ్య పాల్గొన్నారు.


తల్లిదండ్రులకు కౌన్సిలింగ్ నిర్వహిస్తున్న ఏఎస్సై వెంకన్న, చైల్డ్‌వెల్ఫేర్ కమిటీ సభ్యుడు అశోక్

రజతోత్సవ సభను జయప్రదం చేయాలి

బయ్యారం, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : వరంగల్ జిల్లా ఎల్కతుర్తిలో ఆదివారం జరిగే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు అన్నివర్గాల ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని, జయప్రదం చేయాలని జిల్లా పరిషత్ మాజీ చైర్‌పర్సన్ అంగోత్ బిందు పిలుపునిచ్చారు. రజతోత్సవ బహిరంగ సభ జయప్రదం కోసం శనివారం ఆమె మండలంలోని పలు గ్రామాల్లో పర్యటించి, జనసమీకరణ చేశారు. మండలాని 500 చొప్పున నియోజకవర్గ వ్యాప్తంగా 3 వేల మందిని తరలించేలా ప్రణాళికలు చేస్తున్నట్లు ఈ సందర్భంగా ఆమె పేర్కొన్నారు.

బీజేపీ బలోపేతానికి కార్యకర్తలు కృషి చేయాలి

డోర్నకల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : బీజేపీ పటిష్టతకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని ఆపార్టీ జిల్లా నాయకులు మోతీలాల్, పూర్ణచందర్‌రావు పిలుపునిచ్చారు. శనివారం మునిసిపల్ కేంద్రంలోని జైన్ భవన్‌లో పార్టీ కార్యవర్గ సమావేశాన్ని ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ డోర్నకల్ మండలంలో అన్నితండాలో కూడా పార్టీ కమిటీలు వేసి, పార్టీ పటిష్టతకు కృషి చేయనున్నట్లు చెప్పారు. బీజేపీ సాధించిన విజయాలను ప్రజల్లోకి తీసుకువెళ్లాలన్నారు. రాష్ట్రంలో కాంగ్రెస్, బీఆర్ఎస్ పార్టీలు ప్రజాసమస్యలను విస్మరించారని చెప్పారు. ఈ సమావేశంలో నాయకులు దేవాసింగ్, గణేష్‌నాయక్, నాగేష్, రెహమాన్, లకన్‌వ్యాస్, కాపరబోయిన కృష్ణ, ఆవుదుర్తి రవి, రాయల రాంబాబు పాల్గొన్నారు.


డోర్నకల్ బీజేపీ సమావేశంలో మాట్లాడుతున్న మోతీలాల్

ప్రజల ప్రాణాలతో అధికారుల చెలగాటం

- బీజేపీ యువమోర్చా రాష్ట్ర కార్యదర్శి గుగులోత్ మదన్

నెల్లికుదురు, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నల్లగుట్ట తండాలోని శ్రీవేంకటేశ్వర స్టోన్ క్రషర్‌పై మైనింగ్ అధికారులు చర్యలు తీసుకోకుండా, మైనింగ్ అధికారులు గిరిజన ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్నారని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర కార్యదర్శి గుగులోత్ మదన్ విమర్శించారు. నల్లగుట్ట తండావాసులు శ్రీవేంకటేశ్వర స్టోన్‌క్రషర్ ముందు శనివారం నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ శ్రీవేంకటేశ్వర్ల స్టోన్ క్రషర్‌లో బాంబులు పేల్చడం వలన చుట్టుప్రక్కల తండాలలో ఇండ్లు బీటలు ఏర్పడి కూలిపోయేదశకు చేరుకున్నాయన్నారు. మైనింగ్ శాఖ, రెవెన్యూశాఖ అధికారులకు ఫిర్యాదు చేసిన పట్టించుకోవడంలేదని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో హచ్చునాయక్, శ్రీనునాయక్, రమేష్‌నాయక్, కన్నయ్యనాయక్ మంగు శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ఇంటర్‌బోర్డు ప్రకటనపై తెలుగు అధ్యాపకుల హర్షం

మహబూబాబాద్ ఎడ్యుకేషన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలోని జూనియర్ కళాశాలల్లో సంస్కృతం ప్రవేశపెడుతున్నాం అని వస్తున్న వార్తలు అవాస్తమని ఇంటర్మీడియట్ బోర్డు ప్రకటించడం హర్షనీయమని తెలుగు అధ్యాపకులు టీజీఎల్‌ఏ నాయకులు నయింపాష అన్నారు. ఈ మేరకు శనివారం హైదరాబాద్‌లోని ఇంటర్మీడియట్ బోర్డు సెక్రటరీ కృష్ణఆదిత్య, రీజినల్ జాయింట్ డైరెక్టర్ జయప్రద బాయిని కలిసి పుష్ప గుచ్ఛం అందజేసి, కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలుగంటే కేవలం ఒక సబ్జెక్టు కాదని, తెలుగు బోధించే గురువు విద్యార్థులకు మంచి, చెడులు చెప్తూ నైతిక విలువలు పెంపొందించే వ్యక్తిత్వ వికాస నిపుణుడని పేర్కొన్నారు. నేటి సమాజంలో అంతంమాత్రంగా ఉన్న విలువలు భావితరాలకు పెంపొందించడానికి తెలుగు ఇంటర్, డిగ్రీలో చాలా అవసరమని తెలిపారు. ఈ కార్యక్రమంలో అధ్యాపకులు సుధారాణి, మోదుగు వెంకట్, ఉమాలక్ష్మి పాల్గొన్నారు.


ఇంటర్‌బోర్డు డైరెక్టర్, ఆర్జేడీలను కలిసి కృతజ్ఞతలు తెలుపుతున్న తెలుగు అధ్యాపకులు

'రాజ్యాంగ రక్షణ సదస్సు తరలిరావాలి'

ఇనుగుర్తి, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మహబూబాబాద్‌లో ఈనెల 29న జాతీయ మాలమహానాడు, ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నిర్వహించే రాజ్యాంగ రక్షణ సదస్సుకు తరలిరావాలని కోరుతూ ఇనుగుర్తి మండల కేంద్రంలో శనివారం కరపత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సదస్సుకు ఎంఎల్‌సీ అద్దంకి దయాకర్ హాజరవుతున్నారని నాయకులు తెలిపారు. నాగెల్లి సుధీర్ అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో టీఎంఎం రాష్ట్ర ఉపాధ్యక్షుడు దార్ల రాంమూర్తి, బేతమల్ల చంద్రయ్య, పప్పుల వెంకన్న, దార్ల భాస్కర్, చిన్నాల కట్టయ్య, గండు నాగన్న, పింగిళి శ్రీను పాల్గొన్నారు.

మేడేను జయప్రదం చేయండి

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : మే 1న జరుపతలపెట్టిన మేడేను జయప్రదం చేయాలని ఇఫ్టూ రాష్ట్ర కమిటీ సభ్యుడు హలావత్ లింగన్న, జిల్లా అధ్యక్షుడు పర్వత కోటేష్ పిలుపునిచ్చారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని భట్టు అంజయ్య భవనంలో మేడే వాల్ పోస్టర్లను శనివారం ఆవిష్కరించారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ బీజేపీ, ఆర్ఎస్ఎస్ సర్కార్ కార్మిక వర్గంతో పాటు వివిధ రంగాలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో విఫలం చెందారని ఆరోపించారు. కార్మిక వర్గం పోరాడి సాధించుకున్న 49 లేబర్‌చట్టాలను నాలుగు కోడ్‌లుగా కుదించి కార్మికులను బడా పెట్టుబడిదారులకు తాకట్టు పెట్టే కుట్రలు జరుగుతున్నాయని చెప్పారు. జబ్బార్, లక్ష్మయ్య, సురేష్, లింగన్న, రామ్మూర్తి, ఉప్పలయ్య, శ్రీను, వీరభద్రం, వెంకన్న, ఉపేందర్ పాల్గొన్నారు.

తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర కార్యదర్శిగా వీరస్వామి



మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : తెలంగాణ ఉద్యమకారుల ఫోరం (టీయూఎఫ్) రాష్ట్ర కార్యదర్శిగా మానుకోట జిల్లా కేంద్రానికి చెందిన తెలంగాణ ఉద్యమకారుడు సోమారపు వీరస్వామి నియామకమయ్యారు. ఈ మేరకు ఫోరం రాష్ట్ర అధ్యక్షుడు సీమ శ్రీనివాస్ శనివారం ఉత్తర్వులు జారీ చేశారు. మానుకోట పట్టణానికి చెందిన వీరస్వామి తెలంగాణ ఉద్యమంలో చురుకైనపాత్ర పోషించారు. గత నలభై సంవత్సరాలుగా కుల సంఘంలో పని చేస్తున్న ఆయన రాష్ట్ర, జాతీయస్థాయి పదవుల్లో కొనసాగారు. తెలంగాణ ఉద్యమ సమయంలో పోలిటికల్ జేఏసీ మానుకోట డివిజన్ ఉపాధ్యక్షుడిగా పని చేశారు. తన నియామానికి కృషి చేసిన రాష్ట్ర అధ్యక్షుడ సీమ శ్రీనివాస్, ఉమ్మడి వరంగల్ జిల్లా అధ్యక్షుడు రజినికాంత్‌కు వీరస్వామి కృతజ్ఞతలు తెలిపారు.

జనజాతర సభను జయప్రదం చేయండి

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి): కుల వివక్ష వ్యతిరేక పోరాట సంఘం (కేవీపీఎస్) ఆధ్వర్యంలో మహబూబాబాద్ ఐఎంఏ హాల్‌లో ఈ నెల 27న జరుపతలపెట్టిన పూలే, అంబేద్కర్ జనజాతర సభను జయప్రదం చేయాలని ఆసంఘం జిల్లా కార్యదర్శి దుడ్డెల రాంమూర్తి తెలిపారు. మహబూబాబాద్‌లో శనివారం నిర్వహించిన సంఘ సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ సభకు ముఖ్యవక్తగా కాకతీయ యూనివర్సిటీ ప్రొఫెసర్ గడ్డం కృష్ణ, లెక్చరర్ ధర్మారపు ఫిరోజిగణేష్, రిటైర్డ్ ప్రిన్సిపాల్ ఏర్పుల వీరస్వామి హాజరు కానున్నారని చెప్పారు. విద్యార్థులు, ప్రజలు, ప్రజాస్వామికవాదులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమావేశంలో జిల్లా అధ్యక్షుడు చీపిరి యాకయ్య పాల్గొన్నారు.

'అధికారులపై చర్యలు తీసుకోవాలి'

మహబూబాబాద్ రూరల్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) :మహబూబాబాద్ మునిసిపాలిటీలో ఇండ్ల అనుమతుల విషయంలో చేతివాటం చూపిస్తున్న అవినీతి అధికారులపై చర్యలు తీసుకోవాలని సీపీఐ(ఎంఎల్) మాస్‌లైన్ జిల్లా సహాయ కార్యదర్శి కొత్తపల్లి రవి శనివారం ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. పేద, సామాన్య, మధ్య తరగతి ప్రజానీకం తమ సొంతింటి కలను నిజం చేసుకోవడానికి రూ.లక్షల్లో అప్పులు చేసి ఇంటి నిర్మాణంచేసుకుంటే నిబంధనలకు విరుద్ధంగా ఇళ్లు నిర్మించారంటూ అవినీతికి పాల్పడుతున్న అధికారులపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

నేడు బీఆర్ఎస్ జెండాల ఆవిష్కరణ

మహబూబాబాద్ టౌన్, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : బీఆర్ఎస్ రజతోత్సవ వేడుకలో భాగంగా ఆదివారం జిల్లా వ్యాప్తంగా ఆ పార్టీ జెండాలను ఆవిష్కరించనున్నారు. హన్మకొండ జిల్లా ఎల్కతుర్తిలో నిర్వహించే బీఆర్ఎస్ రజతోత్సవ సభకు తరలిపోయే ముందు గ్రామగ్రామాన పార్టీ జెండాలు ఆవిష్కరించాలని బీఆర్ఎస్ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ పిలుపునిచ్చారు. అందుకు జిల్లాలోని నాలుగు మునిసిపాలిటీలు, 18 మండలాల పరిధిల్లోని అన్ని గ్రామాల్లో బీఆర్ఎస్ జెండా గద్దెలను సిద్ధం చేశారు. మహబూబాబాద్‌లోని బీఆర్ఎస్ జిల్లా కార్యాలయంలో ఆదివారం ఉదయం 9 గంటలకు జిల్లా అధ్యక్షురాలు, మాజీ ఎంపీ మాలోతు కవిత పార్టీ జెండాను ఆవిష్కరించనున్నారు. బీఆర్ఎస్ కార్యకర్తలు, నాయకులు హాజరు కావాలని విజ్ఞప్తి చేశారు.


తెలంగాణ తల్లి విగ్రహానికి రంగులు వేస్తున్న జడ్పీ మాజీ కోఆప్షన్‌సభ్యుడు మహబూబ్‌పాష

భూ భారతి చట్టం విప్లవాత్మకమైంది

- ఇల్లందు ఎమ్మెల్యే కోరం కనకయ్య

గార్ల, ఏప్రిల్ 26 (ఆంధ్రజ్యోతి) : భూ భారతి చట్టం దేశంలోనే విప్లవాత్మకమైనదని ఇల్లెందు నియోజకవర్గ ఎమ్మెల్యే కోరం కనకయ్య అన్నారు. శనివారం గార్లలో భూ భారతి అవగాహనపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. గత బీఆర్ఎస్ ప్రభుత్వం తీసుకువచ్చిన ధరణి పోర్టల్ ద్వారా ఎంతోమంది రైతులు భూ సమస్యలను పరిష్కరించుకోలేక ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ఇలాంటి భూములకు సంబంధించిన సమస్యలను తీర్చడంలో గత ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందన్నారు. ఈ చట్టం ద్వారా 99 శాతం సమస్యలు తహసీల్దార్, ఆర్డీవో స్థాయిలో పరిష్కారమవుతాయని చెప్పారు. ఈ సందర్భంగా కలెక్టర్ అద్వైత్‌కుమార్‌సింగ్ మాట్లాడుతూ ప్రభుత్వం విప్లవాత్మకమైన భూభారతి చట్టాన్ని పారదర్శకంగా అమలు చేస్తామన్నారు. రైతుల దరఖాస్తులను వేగవంతంగా పరిష్కారిస్తామని చెప్పారు. సమావేశంలో అదనపు కలెక్టర్ వీరబ్రహ్మాచారి, ఆర్డీవో కృష్ణవేణి, నర్సింహామూర్తి, శ్రీనివాసరావు, డీపీవో హరిప్రసాద్, తహసీల్దార్ విజయ, శారద, ఎంపీడీవోలు విజయలక్ష్మి, మంగమ్మ, పీఏసీఎస్ చైర్మన్ వడ్లముడి దుర్గాప్రసాద్, నాయకులు ధనియాకుల రామారావు, మాజీ మార్కెట్ కమిటీ చైర్మన్ భూక్య నాగేశ్వర్‌రావు పాల్గొన్నారు.



గార్లలో మాట్లాడుతున్న కోరం కనకయ్య